## కుంకీ ఏనుగులను పరిశీలించిన సిసిఎఫ్

కుప్పం, నవంబర్ 2 ప్రభాతవార్త



రామకుప్పం మండలంలోని ననియాల ఎలిఫెంట్ క్యాంప్‌ను అనంతపురం సిసిఎఫ్ యశోద బాయి, చిత్తూరు డిఎఫ్ఒ భరణి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎలిఫెంట్ క్యాంపులో ఉన్న గణేష్, జయంత్ కుంకీ ఏనుగులను వారు పరిశీలించారు. ఏనుగుల ఆరోగ్యం, వాటి షెడ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎలిఫెంట్ క్యాంప్‌లో జరుగుతున్న ఎకో టూరిజం పనులను పరిశీలించారు. అనంతరం బేస్ క్యాంప్ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పలమనేరు సబ్ డిఎఫ్ఒ వేణుగోపాల్, కుప్పం ఎఫ్ఆర్వో జయశ ంకర్ పాల్గొన్నారు.


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## స్కంధషష్టి ఉత్సవాలు ప్రారంభం

నగరి, నవంబరు 2 ప్రభాతవార్త:



పట్టణ పరిధి కరకంతేశ్వర స్వామి ఆలయంలో స్కంధషష్టి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం గణపతి పూజ, వల్లిదేవసేన సమేత సుబ్రబ్ణ్య స్వాములకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వాములకు పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించి ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం భక్తుల దర్శనార్థం ఆలయ మండపం వద్ద ఉంచారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. షట్ హారతి పూజలు, ఊంజల్‌సేవ నిర్వహించిన అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఉభయ దారులకు ఆలయ మర్యాదలు చేశారు. నెల 7న సూరసంహారం, 8న కల్యాణోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం తెలిపారు.

# పదవులిస్తారా! ఇవ్వరా!?

### సందిగ్ధంలో తెలుగుతమ్ముళ్ళు ఆవేదన!
### ఆధిపత్యపోరులో నలిగిపోతున్న కీలక నేతలు !

ప్రభాతవార్త-తిరుపతి:



"కరవమంటే కప్పకు కోపం వదలమంటే పాముకు శాపం"లా మూడునాలుగు దశాబ్ధాలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంతజిల్లాలో పార్టీకోసం పనిచేస్తున్న తెలుగు తమ్ముళ్ళ పరిస్థితి తయారైంది. గతంలో కంటే మెరుగ్గా ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్యంగా భారీ మెజార్టీతో ఎన్‌డిఎ కూటమిలోని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు తిరుపతి, చిత్తూరు ఉభయజిల్లాల్లో గెలిచారు. ఇక్కడ తొలినుండి ఆధిపత్యపోరు నడుస్తున్నా ఇప్పుడు తిరుపతిలో వినూత్నంగా కూటమిలో జనసేనపార్టీ చేరడంతో ఇక్కడ శ్రీనివాసులు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని, నాయకత్వాన్ని తొలినుండి వ్యతిరేకించిన టిడిపి నేతలతోబాటు జనసేన నేతలు కూడా ఇప్పుడు మింగుడుపడని వ్యవహారంలా మారింది. ఆయన తన కుటుంబంలో వారికి పెత్తనం ఇవ్వడం, వదలిన పాత పార్టీ వైసిపి నేతలతో, కార్పొరేటర్లతో చెట్టపట్టాలు వేసుకుని తిరుగుతుండటంతో తెలుగుతమ్ముళ్ళలో అసహనం నెలకొంది. అంతేగాక వైసిపిని వీడిని నేతలకు ప్రాధాన్యతనిచ్చి గెలిపించిన టిడిపి నేతలు, కార్యకర్తలను విస్మరించడం సిఎం చంద్రబాబు, యువనేత లోకేశ్ వరకు ఫిర్యాదు అందింది. అయితే ఇప్పటి వరకు టిడిపి నేతలపైనే ఫిర్యాదు చేస్తూ వస్తున్న ఎమ్మెల్యేకు చెక్‌పెట్టేందుకు తిరుపతిలోని ఓ టిడిపి వర్గం ఆధారాలు సిద్ధం చేసుకుంటోంది. ఆ వర్గం లోకేశ్‌ను కలసి ఆధారాలతో ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటికే టిటిడి బోర్డులో కూడా తిరుపతి జిల్లాకు చెందిన నేతలకు కనీసం ప్రాధాన్యత ఇవ్వకపోవడం దానికి కారణం కూడా ఎమ్మెల్యేనేనని ఇప్పుడు తెలుగుతమ్ముళ్ళు మండిపడుతున్నారు. కాగా ఉభయ జిల్లాల్లో తెలుగుదేశం పార్టీలో కొందరు నేతల వ్యవహార శైలితో ప్రజాబలం ఉన్న కీలక నేతలు నలిగిపోతున్నారు. పార్టీయే ప్రాణంగా భావించి పనిచేస్తున్న కేడర్‌కు కూడా తగిన గుర్తింపు లేకపోతోందని అసహనం చెందుతున్నారు. ఇటీవల తిరుపతి జిల్లాకు వచ్చిన ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కొందరు టిడిపి నేతలు భేటీ అయ్యి తాడోపేడో తేల్చుకునే స్థాయికి వచ్చారంటే అసహనం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఉభయజిల్లాల్లో ఇప్పటికే కొందరు టిడిపి ఎమ్మెల్యేలు గతంలోనూ ఇప్పుడూ వైసిపితో అంటకాగుతున్నారనే విషయంపై అధిష్టానం అసహనం, సీరియస్‌గానే ఉంది. అక్కడ పార్టీకి విధేయులైన వారికి గుర్తింపునివ్వాలని చూస్తున్నా కఠినంగా నిర్ణయం తీసుకోలేకపోతున్నారని కార్యకర్తలు ఆగ్రహం చెందుతున్నారు. సిఎం చంద్రబాబు సొంత జిల్లాల్లో టిడిపి నేతలకు పదవులు ఇస్తారా?ఇవ్వరా !?అనే అనుమానం బలంగా వ్యక్తం చేస్తున్నారు. ఇంకా కొందరు సీనియర్లు పార్టీని ప్రాణంగా నమ్ముకున్న వారికి అధికారంలోకి వచ్చిన మూడునెలలు గడుస్తున్నా తగిన గుర్తింపు ఇవ్వడంలేదనే ఆవేదనతో రగిలిపోతున్నారు.

### దీపం 2.0 పథకం

# పేద మహిళలకు వరం

### పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 2, ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి, సాధికారతకు కట్టుబడి ఉంటుందని, దీపం 2.0 పథకం పేద మహిళలకు వరం అని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక చెన్నారెడ్డి కాలనీ మున్సిపల్ ప్రైమరీ స్కూల్ ఆవరణ నందు ఏర్పాటు చేసిన దీపం 2.0 కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి జిల్లాలో ఈ కార్యక్రమం నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కూపంలో నెట్టివేశారని అన్నారు. ముఖ్యమంత్రి పేద మహిళలు కట్టెల పొయ్యితో వంట చేయడం వలన వారికి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయనే ఉద్దేశ్యంతో వారికి ఉచితంగా సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు దీపం 2 పథకం కింద లబ్ధి చేకూరుస్తున్నారని తెలిపారు. 2014 - 2019 సంవత్సరంలో కూడా దీపం పథకం కింద పేద మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించడం జరిగిందని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి శ్రీకాకుళం జిల్లా నుండి ప్రారంభించారని, ఆ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు ఈ పథకం పట్ల ఎంతో హర్షం వ్యక్తం చేశారన్నారు. జెసి శుభం బన్సల్ మాట్లాడుతూ దీపం 2 పథకం పేదలకు అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి, పౌర సరఫరాల శాఖ మంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నానని తెలిపారు. అధికారులు లబ్ధిదారులకు ఈకేవైసి ఇబ్బందులు ఉంటే వాటిని త్వరితగతిన పరిష్కరించి అర్హులైన అందరికీ దీపం 2 పథకం లబ్ధి చేకూరేలా చూడాలని సూచించారు. అనంతరం మంత్రి అధికారులతో కలిసి లబ్ధిదారులకు దీపం 2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎన్. మౌర్య, రైల్వే కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, ఆర్‌డిఓ తిరుపతి రాంమోహన్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మాజీ తుడా చైర్మన్ నరసింహ యాదవ్, తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# గుంతల రహిత రహదారులే ధ్యేయం

### - రూ.6.72 కోట్లతో 482 కిమీ బిటి రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభించిన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల



చిత్తూరు, నవంబర్ 2 ప్రభాతవార్త: రహదారి ప్రమాదాలను అడ్డుకట్ట వేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని రహదారులను గుంతల రహిత రహదారులుగా తీర్చి దిద్దడానికి గుంతల రహిత రహదారుల సాధన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని ఎఫ్‌సిఐ గోడౌన్ వద్ద శనివారం చిత్తూరు- పుత్తూరు స్టేట్ హైవే బిటి రోడ్డుపై గల గుంతలను మరమ్మత్తు చేపట్టే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మేయర్ అముదలతో కలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు మాట్లాడుతూ జిల్లాలోని ఆర్‌అండ్‌బి పరిధిలో గల రోడ్ల మరమ్మత్తులకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా 6.72 కోట్ల రూపాయలతో 482 కిమీల బిటి రోడ్డు మరమ్మత్తు పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. చిత్తూరు నియోజకవర్గానికి సంబంధించి 19 లక్షల రూపాయలతో మంజూరైన 12.5 కిమీల రోడ్డు మరమ్మత్తు పనులు ప్రస్తుతం ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మేయర్ అముదలు మరమ్మత్తుకు గురైన బిటి రోడ్డుపై తారు, కంకర వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ కఠారి హేమలత, ఆర్‌అండ్‌బి ఇఇ శ్రీనివాసులు, డిఇ నాగమల్లయ్య, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆకాశ దీపాన్ని ఆవిష్కరించిన ఇఓ



ఆకాశదీపాన్ని ఆవిష్కరిస్తున్న ఇఓ ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్

శ్రీకాళహస్తి, నవంబర్ 2 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తిక మాసంలో కోట మండపం వద్ద ఆకాశదీపాన్ని శనివారం ఆలయ కార్యనిర్వాహణాధికారి, తిరుపతి ఆర్‌జెసి ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ ఆవిష్కరించారు. బహుశా ఆయన పాల్గొనే అధికారిక కార్యక్రమాల్లో ఆయన పదవి కాలంలో చివరిదని భావిస్తున్నారు. కోట మండపం వద్ద ఏర్పాటు చేసిన ఆకాశ దీపాన్ని వేదపండితులు వేద మంత్రాలు చదువుతండగా ఆజాద్ దంపతులు స్థంభంపై అధిరోహింపజేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వల్పకాలిక విధి నిర్వహాణలో ఎన్నో సంస్కరణలు చేపట్టామన్నారు. ఆయన శనివారం ఆకాశ దీపాన్ని అధిరోహింపజేసి స్వామికి పూజించారు. ఈ కార్యక్రమాల్లో డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఓ లోకేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషనం యాదవ్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం నాయుడు, పిఆర్‌ఓ రవి తదితరులు పాల్గొన్నారు. ఆలయ ప్రదానార్చకులు సంబంధం గురుకకుల్, కరుణాకర్ గురుకుల్స్ సారధ్యంలో పౌరోహితులు అర్థగిరి నిర్వహించారు.

**ప్రతి సోమవారం కోనేరుల్లో అఖండ దీపాలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న కార్తీక మాసం శోభలో భాగంగా పట్టణంలోని కోనేరుల్లో అఖండ దీపాలను వెలగించుటకు ఆలయ ఇఓ ఆజాద్ చట్టబద్ధత చేసారు. ఒక్కొక్క సోమవారం ఒక్కొక్క కోనేరులో నారదపుష్కరిణి, వైష్ణవ కోనేరు, భరద్వాజతీర్థం, శుకబ్రహ్మాశ్రమం వద్ద కోనేరుల్లో దీపాలు వెలిగించుటకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

# సముద్రపు ముఖద్వారం పరిశీలించిన రాష్ట్ర కమిషనర్

వాకాడు, నవంబర్ 2, ప్రభాతవార్త



వాకాడు మండలం పూడి రాయి దొరువు సముద్రపు ముఖద్వా రాన్ని శనివారం రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ డోల శంకర్, జిల్లా మత్స్య శాఖ అధికారి నాగ రాజు పరిశీలించారు. మండలంలోని పూడిరాయి దొరువు సముద్రపు ముఖ ద్వారంకు కేంద్ర, రాష్ట్రాలు ఆదేశాల మేరకు పరిశీలించారు. ఆ ప్రాంతంలోని నివసిస్తున్న మత్స్యకారులు, కాపులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా తూపిలిపాలెం, కొండూరు పాలెం, సుగరాజుపట్నం గ్రామాలలోని సముద్ర ముఖ ద్వారంను బృందం పరిశీలించారు. కొండూరు పాలెం సముద్రం వద్ద పులికాట్ లేకును పరిశీలించారు. స్థానిక నాయకులు ద్వారా సమాచారం తీసుకుని ఆ ప్రదేశాలను సందర్శించారు. ముఖ ద్వార పనులు నిమిత్తం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. వారి వెంట బిజెపి సీనియర్ నాయకులు పాపా రెడ్డి, పురుషోత్తం రెడ్డి, సన్నారెడ్డి, విజయశేఖర్ రెడ్డి, ఎన్డీఓ రెడ్డి నాయక్, రగుబాబు, మధుసూధన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుడే కాలయముడు

### -తలపై బండరాయితో కొట్టి హతమార్చాడు



రక్తపు మడుగులో నాగరాజు మృతదేహం

తొట్టంబేడు, నవంబర్ 2 ప్రభాతవార్త

ఇద్దరు ఆటో డ్రైవర్లు, అత్యంత సన్నిహితులు ఏమైందో ఏమో కానీ శనివారం వీరిలో నాగరాజు రక్తపు మడుగులో పడి మృతిచెందడం కనిపించింది. సమాచారం అందుకున్న సిఐ తిమ్మయ్య, ఎస్ఐ ఈశ్వరయ్యలు తమ సిబ్బందితో సంఘటనా చేరుకుని పరిశీలించారు. రక్తపుమడుగులో పడి ఉన్న నాగరాజు అయ్యప్పస్వామి మాలవేసి ఉన్నాడు. తడ స్వగ్రామం కాగా గత మూడు సంవత్సరాల నుంచి బిపి అగ్రహారంలో నివాసం ఉంటున్నాడు. రాజయ్య కుమారుడు నాగరాజు(30) తడ నుంచి బిపి అగ్రహారంలో నివాసం ఉంటూ పట్టణానికి సమీపంలోని సున్నపు అరుంధతీవాడలో నివాసం ఉంటున్న లక్ష్మీగంగను 3 సంవత్సరాల క్రితం ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడు. వీరికి పిల్లలు లేరు. నాగరాజు, రాజేష్‌లు ఇద్దరు సన్నిహితులు కాగా నాగరాజు ఇటీవల కొన్ని రోజుల నుంచి రాజీవ్‌నగర్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి భార్య ఇంట్లోలేని సమయంలో నాగరాజును మిత్రుడు రాజేష్ సిమెంటు దిమ్మెతో తలపై కొట్టడంతో రక్తపుమడుగులో పడి మృతిచెందాడు. ఇద్దరు ఆటో డ్రైవర్‌తో పాటు సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. శుక్రవారం రాత్రి నాగరాజు ఇంటికి వచ్చిన రాజేష్ భార్య, భర్తల మద్య వివాదాలు సర్దిపెట్టే క్రమంలో నాగరాజుతో వాగ్వాదానికి గురికావడంతో పక్కనే ఉన్న బండరాయితో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందడంతో రాజేష్‌పరారయ్యారు. సిఐ తిమ్మయ్య, ఎస్ఐ ఈశ్వరయ్యలు మాట్లాడుతూ కేసునమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి పరారీలో ఉన్న రాజేష్‌కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

# అందని వేతనం.. బతుకు గగనం

కోట, నవంబర్ 2 ప్రభాతవార్త




ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులతో పాటు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారికి మొదట గుర్తొచ్చేది 108 అంబులెన్స్. అలాగే ప్రసవాలు జరిగిన మహిళలను ఇళ్లకు చేర్చేది.. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ప్రజలకు సేవలు అందిస్తున్నది 104. ప్రజలకు చేరువగా ఉన్న ఈ వాహనాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులకు మాత్రం మూడు, నాలుగు నెలల నుంచి వేతనాలు విడుదల చేయని పరిస్థితి నెలకొంది. 108, 104, 102 వాహనాలను అరబిందో ఎమర్జన్సీ మెడి కల్ సర్వీసెస్ నిర్వహిస్తోంది. సదరు సంస్థ కార్మికులకు వేతనాలు విడుదల చేయకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చే కొద్దిపాటి జీతంతోనే కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఆ మొత్తం కూడా నెలవారీ ఇవ్వకపోతే తాము ఎలా జీవనం సాగించాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం దీపావళి పండుగ పూట అయినా వేతనాలు ఇస్తారని ఆశించామని, ఇప్పుడు కూడా విడుదల చేయ లేదని వాపోయారు. తామెలా కుటుంబాలను పోషించాలని కాంట్రాక్టు ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క 108 వాహనంలో ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు టెక్నీషియన్లు పనిచేస్తారు. 108, 104 వాహనాల పనితీరుకు సంబంధించి పర్యవేక్షణ మాత్రమే ఆరోగ్యశాఖ పరిధిలో ఉంటుంది. ఉద్యోగులు, టెక్నీషియన్లు, వేతనాలు విడుదల మొత్తం అరబిందో కంపెనీ నిర్వహిస్తుంది. తమకు ఇకనైనా వేతనాలు అందజేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

# లింగసముద్రం వద్ద అక్రమ లేఅవుట్..!

### చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న మండల అధికారులు.. మౌనం వెనక అంతరార్థ్యం కాని వైనం...
### ఎమ్మెల్యే కురుగొండ్ల జోక్యంతో ఉలిక్కి పడ్డ అధికారులు.. మండలస్థాయిలో ఇదే ప్రథమ అక్రమ లే అవుట్...
### జిల్లా స్థాయి అధికారులు ఏమి చర్యలు తీసుకుంటారో వేసి చూస్తున్న ప్రజలు...

డక్కిలి, నవంబర్ 2 ప్రభాతవార్త;



వెంకటగిరి నియోజకవర్గం డక్కిలి మండలంలో లింగసముద్రం వద్ద అక్రమంగా ఓ భారీ లే అవుట్ వెలుస్తోంది. ఈ లే అవుట్ వెనుక వెంకటగిరికి చెందిన ప్రముఖులు ఉన్నట్లు సమాచారం. డక్కిలి మండలంలో ఈ లే అవుట్ వేయడం ద్వారా భారీగా సొమ్ము చేసుకోవాలన్న ఆశతో నిబంధలనకు విరుద్ధంగా ప్లాట్లు వేసి విక్రయించేందుకు స్కెచ్ వేశారు. ఈస్కెచ్‌లో భాగంగా స్థానికంగా ఉండే కొంత మంది నాయుకులను ప్రసన్నం చేసుకొన్నారు. ఇక అడ్డంకులు ఉండవన్న ధీమాతో లే అవుట్ వేసే క్రమంలో అవసరమైన నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కారు. ఇందులో భాగంగా భూములను చదును చేసి రోడ్లు వేయడం చేస్తున్నారు. జాతీయ రహదారి 565 అనుకుని ఉన్న ఈ లే అవుట్ నిర్మాణాన్ని డక్కిలికి వచ్చే అధికారులు నిత్యం చూస్తున్న కన్నెత్తి చూడకుండా చూసి చూడనట్లుగా వ్యవహరించడం మరి విడ్డూరంగా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. సాక్షాత్తు వెంకటగిరి ఎమ్మెల్యే కురరుగోండ్ల రామకృష్ణ అటువైపు వెళుతూ చూసి ఏందీ ఇక్కడలేఅవుట్ వేస్తున్నారు..అనుమతులు ఉన్నాయా అని అధికారులను ప్రశ్నిస్తే తీగ లాగితే డోంక కదిలినట్లు అటు రెవిన్యూ, ఇటు ఎంపీడీవో కదలిక వచ్చింది. అయితే పనులు రియల్ యజమానులు ప్రతిరోజు రాత్రి వేళల్లో గుట్టుచప్పుడుకాకుండా రాత్రి వేళల్లో చేస్తున్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. డక్కిలి మండలంలో లింగసముద్రం వద్ద సుమారు 10 ఎకరాలలో భారీ లే అవుట్‌ను వెంకటగిరి పట్టణానికి చెందిన కొంత మంది ప్రముఖులు, లింగసముద్రం గ్రామానికి చెందిన ఓ పెట్రోల్ బంకు యజమాని కలిసి అక్రమ లేఅవుట్‌ను చేస్తున్నారు. వెనుక నికంగా ఉండే మండల స్థాయి నాయకులు వత్తాసు పలుకుతున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ లే అవుట్ నిర్మాణంలో యజమూనులు లింగసముద్రం వద్ద 10 ఎకరాలను కొనుగోలు చేసి భారీ అక్రమ లే అవుట్‌కు తెరతీశారు. ఇందులో కొంత భాగం అసైన్‌మెంట్, కొంత సెటిల్‌మెంట్ భూములు ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈలే అవుట్‌కు సంబంధించి భూముల కొనుగోలు కూడా సంబంధిత రైతులకు భారీగానే సొమ్ము చెల్లించి కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. జాతీయ రహదారికి అనుకుని ఉండడం, నాలుగు రోడ్ల కూడలికి దగ్గరగా ఉండడం వల్ల రాబోయే రోజుల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోందన్న ముందుస్తు ఆలోచనలతో రియల్ ఎస్టేట్ యజమూనులు అక్రమాలకు తెరతీసి లే అవుట్‌ను నిర్మిస్తున్నారు. ఈ లే అవుట్ నిర్మాణం వెనుక పెద్దలు హస్తం ఉండడంతో ఎవ్వరూ స్పందించే పరిస్థితి కనబడడం లేదు. వాస్తవానికి అధికారులను మచ్చిక చేసుకుని ఆగమేఘాల మీద లింగసముద్రం వద్ద వెంచరు ఏర్పాటు చేస్తున్నారు. తమకు వెంచరు ఏర్పాటు చేయడంలో తుడా (తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ) నుంచి అనుమతులు ఉన్నాయని స్థానిక మండల స్థాయి అధికారులను మభ్య పెట్టి భారీ ఆర్థిక స్కామ్‌కు పాల్పడతున్నట్లు విమర్శలు జోరుగాసర్వత్ర వ్యక్తం అవుతున్నాయి. వాస్తవానికి ఎక్కడ లే అవుట్ వేయాలన్న అక్కడి స్థానికంగా ఉండే పరిపాలనకు సంబంధించి అనుమతులుపొందాల్సి ఉంది. అయితే తుడా పేరు చెప్పి లింగసముద్రం పంచాయతీ కార్యదర్శి, మండల స్థాయి అధికారులను మభ్య పెట్టి లింగసముద్రం వద్ద లేఅవుట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు వీరు వేస్తున్న లేఅవుట్ కొంత భూమి సెటిల్‌మెంట్, కొంత మేర అసైన్‌మెంట్ భూమి ఉంది. అసైన్‌మెంట్ భూముల్లో ఎటువంటి లేఅవుట్‌లు వేయరాదని ఉంది. అంతేగాక వ్యవసాయం చేస్తున్న భూమి లేఅవుట్ వేయాలంటే కమర్షియల్ భూమిగా మార్పిడి చేయాలి. అయితే ఈ బడా బాబులు ఏమైతుందుందులే అన్న ధీమాతో భారీ లేఅవుట్‌కు పనులు చేస్తున్నారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకున్నా ఏమి కాదులే అన్న ధీమా వారిలో కనిపిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు ద్వారా తెలుస్తోంది. స్థానిక తహాశీల్దారును వివరణ కోరగా ఈవిషయంపై ఇప్పటికే వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలియజేయడంతో పనులు నిలిపి వేయించినట్లు, అన్నీ అనుమతుల తీసుకున్న తర్వాత పనులు చేసుకోవాలని తెలిపారు. లేఅవుట్‌లో ఏమైనా అసెన్‌మెంట్ భూములు ఉంటే వాటిని ప్రభుత్వం స్వాధీనంచేసుకుంటుందని తెలియజేశారు. తుడా అనుమతులు రూరల్ ఏరియాలో చెల్లవని చెప్పారు.

## గుంతలమయమైన రోడ్డులో పడి మహిళకు గాయాలు



కుప్పం, నవంబర్ 2 ప్రభాతవార్త కుప్పం కొత్తపేట కూర్మాయిపురంలో గుంతలమయమైన సిసి రోడ్డులో నడవలేక కుప్పమ్మ అనే మహిళ కింద పడడంతో ఆమెకు చేయి విరిగింది. విషయం తెలుసుకున్న కుప్పం తెదేపా విస్తరణ కమిటీ నేత, దళిత నాయకులు కన్నన్ బాధితురాలిని పరామర్శించి నాటువైద్యం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విషయాన్ని ఎమ్మెల్సీ డా॥ కంచర్లశ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబు, సిఎం పిఎ మనోహర్ దృష్టికి తీసుకెళ్లి రోడ్డు పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు.

## పాలిటెక్నిక్ కాలేజ్‌కు రూ.లక్షల విలువ చేసే పుస్తకాల వితరణ



**కుప్పం, నవంబర్ 2 ప్రభాతవార్త** కుప్పంలోని డా॥ వైసి జేమ్స్ ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గ్రంథాలయానికి కాలేజ్ పూర్వ విద్యార్థి అయిన స్వరూప్ లక్ష రూపాయల విలువ చేసే పుస్తకాలను వితరణగా అందించినట్లు ప్రిన్సిపాల్ జగన్నాథరావు తెలిపారు. స్వరూప్ తమ కళాశాలలో ఇసిఇ బ్రాంచ్‌లో డిప్లమో చదివి ప్రస్తుతం కాలిఫోర్నియాలో ఫ్లైథాన్ డెవలపర్‌గా పనిచేస్తున్నారన్నారు. తను చదువుకున్న కళాశాలను గుర్తు పెట్టుకుని పుస్తకాల రూపంలో సాయం అందించిన స్వరూప్‌ను అధ్యాపకులు సుబ్బన్న, బాపూజీ నాయక్, జీఎన్ రమేష్, నరసింహులు, లైబ్రరీ ఇన్‌చార్జ్ సుగుణ అభినందించారు.

## నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



కుప్పం, నవంబర్ 2 ప్రభాతవార్త మండలంలోని చెక్కునత్తం పంచాయతీ కూసూరు గ్రామంలో నూతనంగా సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను తెదేపా నేతలు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులతో ఈ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెదేపా యువత రాష్ట్ర కార్యదర్శి చెక్కునత్తం మణి తెలిపారు. కార్యక్రమంలో వనసంరక్షణ సమితి ఛైర్మన్ కనకరాజు, నేతలు శివకుమార్, ఆచారి,జెఎంసి మురళి, జెకె సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి బోర్డుసభ్యుడు శాంతారాంను సత్కరించిన దేశం నేతలు



**శాంతిపురం, నవంబర్ 2 ప్రభాతవార్త** తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడు వైద్యం శాంతారాంను శనివారం శాంతిపురం మండల తెదేపా నేతలు ఘనంగా సత్కరించారు. వసనాడు గొల్లపల్లిలో ఉన్న శాంతారాం స్వగృహంకు చేరుకున్న నేతలు ఆయనను దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించి అభినందించారుమండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, బిసి సెల్ ఉపాధ్యక్షుడు ఈడిగ రమేష్, నేతలునాగరాజు, బాబు, శివ, నాగరాజు, రమేష్, చంద్రారెడ్డి, అనసూయ, శ్యామలమ్మ, సరిత పాల్గొన్నారు.

## రాళ్ల గంగమ్మ ఆలయంలో చోరీ



**కుప్పంరూరల్, నవంబర్ 2 ప్రభాతవార్త** మండలంలోని చెక్కునత్తం పంచాయతీ అడవిములకలపల్లి గ్రామంలోని శ్రీ రాళ్ల గంగమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం రాత్రి దుండగులు ఆలయం గేట్లు పగలగొట్టి అమ్మవారి నగలు, హుండీలోని నగదు పట్టుకెళ్లినట్లు తెలిపారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## జాతీయస్థాయి పెన్సింగ్ క్రీడాకారిణికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

కాణిపాకం, నవంబర్ 2 ప్రభాతవార్త:



జాతీయస్థాయి పెన్సింగ్ క్రీడాకారిణి యువశ్రీ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ శనివారం ఆర్థికసాయంను అందించారు. కాణిపాకం జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పెన్సింగ్ క్రీడాకారిణి యువశ్రీ ఈనెల 17న జమ్మూ-కాశ్మీర్‌లో జరుగనున్న అండర్-17 పోటీల్లో పాల్గొననుంది. ఈపోటీల్లో పాల్గొనేందుకు వెళ్ళేందుకు అవసరమైన ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే మురళీమోహన్ అందించారు. ఈమొత్తాన్ని యువశ్రీ తల్లిదండ్రులు జగన్నాథం, సుమలతకు అందజేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు హరిబాబునాయుడు, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మదుసూధన్‌రావులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పక్కాగా విధులు నిర్వహణ

– అధికారులు, సిబ్బందికి జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు ఆదేశం



**చిత్తూరు, నవంబర్ 2 ప్రభాతవార్త:** పక్కాగా విధులు నిర్వర్తించి జిల్లా పరిషత్ కీర్తిని మరింత పెంచాలని జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలోని వివిధ సెక్షన్లను తనిఖీ చేశారు. ఈ సందర్బంగా జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు జడ్పీ సెక్షన్ ఎఓలు, అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. జడ్పీ కార్యాలయంలోని వివిధ సెక్షన్లలో పనుల నిమిత్తం వచ్చిన ఫైళ్ళను ఎప్పటికప్పుడు క్లియర్ చేసి ఇతరులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని స్పష్టం చేశారు. జడ్పీ పిఎఫ్ విభాగంలో సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించడానికి పక్కాగా చర్యలు చేపటాలని ఆదేశించారుజిల్లా పరిషత్ కార్యాలయ ఎఓలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి పాలకమండలిలో హిందుత్వ పరిరక్షణకు ప్రాధాన్యత



**చిత్తూరు, నవంబర్ 2 ప్రభాతవార్త:** గత మూడు దశాబ్దాలుగా హిందూధర్మ పరిరక్షణ కోసం, టిటిడి పరిపాలన విధానాలపై ఉద్యమాలు చేసిన గుడిపల్లి భానుప్రకాష్‌రెడ్డిని తిరుమల-తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా అవకాశం కల్పించి పాలకమండలిలో హిందుత్వ పరిరక్షణకు ప్రాధాన్యత ఇచ్చారని జిల్లా బిజెపి నాయకులు డాక్టర్ చిట్టిబాబు కొల్లా పేర్కొన్నారు. టిటిడి పాలకమండలి సభ్యులుగా నియమితులైన భానుప్రకాష్‌రెడ్డిని శనివారం బిజెపి నాయకులు డాక్టర్ చిట్టిబాబు కొల్లా కలిసి అభినందించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గతంలో బోర్డు సభ్యులుగా వకుళ మాత ఆలయ నిర్మాణానికి, స్విమ్స్, రుయా వైద్యశాలలను టిటిడి ఆధీనంలోకి తీసుకురావడానికి భానుప్రకాష్‌రెడ్డి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందరెడ్డి, సోమశేఖర్ చౌదరి, పెరుమాళ్ సుబ్బారెడ్డి, రెడ్డి మస్తాన్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ మండలాధ్యక్షుడుగా సహదేవయ్య



**చౌడేపల్లి, నవంబర్ 2 ప్రభాతవార్త** ఏపి ఐక్య ఉపాధ్యాయ(యుటిఎఫ్)మండలాధ్యక్షుడుగా సహదేవయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ప్రాథమిక పాఠశాల పరిధిలో ఆసంఘ రాష్ట్ర నాయకులు రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ప్రధాన కార్యదర్శిగా లోకనాథరెడ్డి, కోశాధికారిగా రమేష్‌లను ఎన్నుకొన్నారు.యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జగన్మోహన్‌రెడ్డి, మండల యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## సమాజ సేవలో జనసేన నాయకులు

చౌడేపల్లి, నవంబర్ 2 ప్రభాతవార్త

నవ సమాజస్థాపనకు నేను సైతం అన్న జనసేనాని పిలుపును ఆదర్శంగా తీసుకొని జనసేన నాయకులు పలు సమాజ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దశాబ్దాల తరబడి అపరిశుభ్రంగా వున్న ఆర్టీసీ బస్టాండును వాడుకలోకి తేవాలని మండల జనసేన నాయకుడు గందోడి చరణ్ రాయల్ కృషి చేస్తున్నాడు. అందులో భాగంగా ప్రయాణీకులకు కనీస అవసరమైన మరుగుదొడ్లను శుభ్రం చేయించాడు. అంతే కాకుండా బస్టాండులో పారిశుధ్య చర్యలు చేపడుతున్నాడు. శనివారం ఈమేరకు ఆర్టీసీ బస్టాండు పరిసరాల్లో పారిశుధ్యం పాటించారు. జనసేన నాయకులు గనశ్యామ్, నరేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు అత్తికుప్పం దత్తమునీంద్రాశ్రమంలో సాధన శిబిరం

రామకుప్పం, నవంబర్ 2 ప్రభాతవార్త

మండలంలోని అత్తికుప్పం గ్రామంలోని శ్రీ దత్త మునీం ద్రాశ్రమంలో భగవాన్ శ్రీసత్యసాయి ఆశీస్సులతో సాధన శిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు ఎస్. మధుసూదనం తెలిపారు. ఓంకార విశిష్ట, సుప్రభాతం ఏభావనతో చెప్పాలి, ధ్యానం ఎందుకు చేయాలి, స్వామి ఉపన్యాసాలు, భక్తిమార్గం, వేద పఠనం తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వివరాలకు 9440690137నెంబరును సంప్రదించాలని కోరారు.

## ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి పెన్షన్లు పంపిణీ



రామకుప్పం, నవంబర్ 2 ప్రభాతవార్త వివిధ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి దేశం నేతలు, సచివాలయ ఉద్యోగులు పెన్షన్లు అందించారు. రామకుప్పంకు చెందిన సుబ్రమణ్యం కుప్పం కెసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతనికి దేశం నేతలు మణి, బాలరాజు, మంజునాథ్‌లు కుప్పం చేరుకుని పింఛను సొమ్ము అందించారు. అలాగే పల్లికుప్పంకు చెందిన కిట్టప్ప వేలూరు సిఎంసి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అతనికి పంద్యాలమడుగు సచివాలయ ఉద్యోగి ఆనంద్ నాయక్ పెన్షన్ నగదు అందించారు.

## చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఎమ్మెల్యేచే వైఎస్.గేట్‌లో మిషన్ ఫాట్ టోల్‌ఫ్రీ



**ఐరాల, నవంబర్ 2 ప్రభాతవార్త:** గ్రామీణ రోడ్లను గుంతల రహిత రోడ్లుగా తీర్చిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ ఫాట్ టోల్‌ఫ్రీ కార్యక్రమంను మండలంలోని వైఎస్.గేటులో శనివారం పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్ ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈకార్యక్రమంను వైఎస్.గేట్-ఎర్రేపల్లె మార్గంలో భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈసందర భంగా ఎమ్మెల్యే మురళీమోహన్ చేతుల మీదుగా గుంతలకు కంకర, తారు వేసి గుంతలను పూడ్చారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో ఎక్కడా గుంతల రోడ్లు వుండకూడదనే ఉద్దేశ్యంతో మిషన్ ఫాట్ హోల్ ఫ్రీ ఏపి కార్యక్రమంను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు పూతలపట్టు నియోజకవర్గంలో గుంతల రోడ్లు పూడ్చేందుకు 84.25 లక్షల రూపాయలు, వర్షాలకు దెబ్బతిన్న రోడ్లుకు 52 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే మురళీ మోహన్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ ధనలక్ష్మి, ఈఓపీఆర్డీ కుసుమకుమారి, టీడీపీ మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు హరిబాబునాయుడు, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మదుసూధన్‌రావులతో పాటు పలువురు అధికారులు,నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

–జూనియర్ సివిల్ కోర్టు జడ్జ్ లిఖిత



పలమనేరు,నవంబర్ 2,ప్రభాతవార్త: డిసెంబర్ 14న జరనున్న జాతీయ లోక్ అదాలత్ ను విజయ వంతం చేయాలని పలమనేరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జ్ లిఖిత తెలిపారు.స్థానిక కోర్టులో శనివారం పోలీసులు ,న్యాయ వాదులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం కక్షిదారులకు జరుగుతుందన్నారు.సుదీర్ఘంగా పెండిం గ్‌లో ఉన్న కేసులు రాజీ మార్గంలో పరిష్కరించుకోవడానికి లోక్‌అదాలత్ ఓ మార్గమన్నారు.డిసెంబర్ 14న జరిగే లోక్‌అదాలత్‌లో సాధ్యమైనంత అధిక కేసుల పరిష్కారానికి న్యాయవాదులు,పోలీసులు కృషి చేయాలనిసూచించారు.ఈసీనియర్‌న్యాయవాదులు లక్ష్మీపతి,పరమశివప్ప,ఎల్.భాస్కర్,పోలీసులు పాల్గొన్నారు.

## లాడ్జీలపై పోలీసులు ఆకస్మిక తనిఖీ

**పలమనేరు,నవంబర్ 2 ప్రభాతవార్త:** పలమనేరు పట్టణంలోని పలు లాడ్జీలను పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు.ఎస్ఐ స్వర్ణతేజ ఆధ్వర్యంలో శనివారం పలు లాడ్జీలను ఆమె సిబ్బందితో తనిఖీ చేశారు.ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారి వివరాలు పట్టణంలో ఉండడానికి గల కారణాలను ఆరాతీశారు.ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ లాడ్జీలలో అసాంగిక కార్యక్రమాలను నియంత్రించేందుకు ఈ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు.పట్టణంలో గుర్తుతెలియని వ్యక్తులు,అనుమానితులు ఎవరైన సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని,అనుమానితులు ఎవరైన లాడ్జీలో ఉంటే తక్షణం తమకు సమాచారం అందించాలని సూచించారు.

## రేపు పట్టుబడిన 97 మెట్రిక్ టన్నుల బియ్యం వేలం

- జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి

**చిత్తూరు, నవంబర్ 2 ప్రభాతవార్త:** జిల్లాలో అక్రమ రవాణా చేస్తూ ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన పట్టుబడిన 97.564 మెట్రిక్ టన్నుల బియ్యంను సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జాయింట్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం వేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు కలెక్టర్(సిఎస్), చిత్తూరు జిల్లా పేరిట ధరవత్తుగా ఎస్‌బిఐ, గిరింపేట బ్రాంచ్‌లో రూ.1 లక్ష విలువ గల డిడి తీసి వేలంకు ముందే డిఎస్ఓ కార్యాలయంలో సమర్పించి వేలంలో పాల్గొవచ్చునని జెసి తెలిపారు.

## ప్రతి ఒక్క హామీ అమలు

**గుడిపాల, నవంబర్ 2 ప్రభాతవార్త:** రాష్ట్రం లోటు బడ్జెట్‌లో వున్నప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కంకణం కట్టుకుని ముందడుగు వేస్తున్నారని గుడిపాల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు పేర్కొన్నారు. మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్ల రీఫిల్లింగ్ కార్యక్రమంను సిఎం నారా చంద్రబాబునాయుడు అమలు చేయడంతో ప్రతి మహిళ ముఖంలో చిరునవ్వు కన్పిస్తుందన్నారు. గుడిపాల మండలంలో ఉచిత గ్యాస్ సిలెండర్ల రీ-ఫిల్లింగ్ కార్యక్రమానికి హాజరైన జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పంటపై పగ

### పంటను గడ్డిమందుతో నాశనం,

### న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు



**దొరవారిసత్రం, నవంబర్ 2, ప్రభాతవార్త** దొరవారి సత్రం మండల పరిధిలోని బూదూరు గ్రామంలో వరి పంటపై ఓ మానవమృగం పగ పట్టి గడ్డిమందుతో నాశనం చేసిన విషయం ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల మేరకు బూదూరు గ్రామానికి చెందిన సి. రాఘవరెడ్డి పొలాలకు అదే గ్రామానికి చెందిన చంద్రయ్య గత పదేళ్ళుగా కాపలాదారుడుగా ఉన్నాడు. అయితే ప్రతి ఏడాది లాగ ఈ సారి కూడా రాఘవరెడ్డి పొలాలలో వరి పంటను చంద్రయ్య వేశాడు. అయితే వరి పంట బాగా వేపుగా పెరిగి చేతికందే సమయంలో అదే గ్రామానికి చెందిన ఓ మానవ మృగం పైచాచికంగా విషపు మందుతో పంటకు కడుపు నింపే పచ్చని వరి పంటకు ఎలాంటి కనికరం లేకుండా రాత్రి వేళలో పంటను పూర్తిగా నాశనం చేసాడు. దీంతో ఆ రైతు ఆ పంటను చూస్తూ ఏమీ చేయలేని పరిస్థితిలో పంట పొలాల వద్దే కన్నీటి వర్షం కురిపించాడు.

**– *గ్రామంలో పంటపై పగ***

బూదూరు గ్రామంలో గత కొంత కాలం నుంచి భూ సమస్యలతో వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. గత ఆరు నెలలుగా గూడూరు రెవెన్యూ పరిధిలోని పొలాలు ఒకరిపై మరొకరు అమ్మకాలు జరిపి అసలైన లబ్ధిదారుల భూములను లేకుండా అమ్మేశారంటూ పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ క్రమంలో ఒకరిపై ఒకరి ఉన్న కక్షలతో పంట పై పగ తీర్చుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నష్టపోయిన బాధితుడికి అధికారులు న్యాయం చేస్తారా లేదా నాయకుల ఒత్తిడిలకు లొంగిపోతారా అని వేచిచూడాలి.

## హత్య కేసులో ముగ్గురు ముద్దాయిలు అరెస్టు



చిల్లకూరు, నవంబర్ 2, ప్రభాతవార్త హత్య కేసులో ముద్దాయిలు అరెస్టుపై గూడూరు డిఎస్పి వివి రమణకుమార్ పోలీస్ స్టేషన్‌లో ముద్దాయిలు అరెస్టుపై విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిల్లకూరు మండలంలోని కడివేడు అరుంధతి వాడలో ఈ నెల 31వ తేదీ గురువారం సాయంత్రం ఎర్రిపాక వెంకటేశ్వరును అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కళ్ళల్లో కారం కొట్టి హత్య చేసిన విషయం ఎర్రిపాక వెంకటేశులు తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు గూడూరు రూరల్ సిఐ కిషోర్ బాబు, చిల్లకూరు ఎస్ఐ సురేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా కడివేడు అరుంధతి వాడకు చెందిన పొట్టేళ్ల సుబ్రమణ్యం పల్లిపాటి సాయికుమార్, సూళ్లూరు సునీల్ కలిసి ఎర్రిపాక వెంకటేష్ రెడ్డిపల్లి భాస్కర్ గుడిసెలో మరో ముగ్గురుతో కలిసి మధ్యం సేవిస్తున్న విషయాన్ని తెలుసుకున్న పొట్టేళ్ల సుబ్రమణ్యం మరో ఇద్దరితో కలిసి ప్రదేశానికి వెళ్ళి కళ్ళల్లో కారం చల్లి ఇనపరాడుతో తలపై బలంగా కొట్టడంతో అక్కడకక్కడ మృతి చెందాడని వారు తెలిపారు. హత్యకు కారకులైన సుబ్రమణ్యం పల్లిపాటి సాయికుమార్, సూళ్లూరు సునీల్ అను కోట క్రాస్ రోడ్ వద్ద అదుపులో తీసుకోవడం జరిగిందని వారు తెలిపారు. వారి వద్ద మోటార్ బైకు హత్యకు ఉపయోగించిన ఐరన్ పైపు సుత్తిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని కోర్టుకు హాజరు పరచడం జరిగిందని వారు తెలిపారు. అదే విధంగా జిల్లా ఎస్పి ఎల్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ప్రశాంత వాతావరణం కలిగిన గ్రామాల్లో శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే ఉక్కుపాదంతో అణిచివేస్తామన్నారు. లా అండ్ ఆర్డర్ విషయంలో ఎంతటి వారినైనా సరే ఉపేక్షించేది లేదన్నారు.ఊదూరు సిఐ కిషోర్ బాబు ఎస్ఐ సురేష్ బాబు సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా వెంకటగిరి యువరాజు జన్మదిన వేడుకలు

వెంకటగిరి, నవంబర్ 2, ప్రభాతవార్త



ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్య క్షులు, వెంకటగిరి యువరాజా వెలు గోటి సర్వజ్ఞ కుమార యాచేంద్ర జన్మ దిన వేడుకలను వైసిపి నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ విబి సాయి కృష్ణ యాచేంద్ర జన్మదిన వేడుకల్లో అందరితో పాటు పాల్గొనడంలో ఆనందంగా ఉందని మాజీ ఎమ్మెల్యే సాయి కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎస్. బాలయ్య, కౌన్సిలర్ ఢిల్లీ బాబు, ఎంఎ నారాయణ, ఆరి శంకరయ్య, నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు యాదవ్, రమేష్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమనెల్లూరులో గ్రామసభ

**కోట, నవంబర్ 2 ప్రభాతవార్త** కోట మండలం ఉత్తమనెల్లూరు గ్రామంలో శనివారం తహశీల్దార్ జయజయరావు ఆధ్వర్యంలో రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. ప్రభుత్వం గతంలో నిర్వహించిన సర్వేలో ఏమయినా పొరపాట్లు జరిగి ఉంటే మళ్లీ సర్వే జరిగిన గ్రామాల్లో రీసర్వే నిర్వహించాలని ఆదేశించింది. ఈ క్రమంలో మండలంలోని ఉత్తమనెల్లూరు, తిన్నెలపూడి, లక్ష్మక్కండ్రిగ గ్రామాల్లో తొలివిడత సర్వే పూర్తి చేశారు. ప్రభుత్వం ఆదేశాలతో రీసర్వే గ్రామసభల ద్వారా నిర్వహించి గ్రామాల్లో ఎవరైనా ప్రజలు అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తున్నామని తహశీల్దార్ జయజయరావు చెప్పారు. ఆ మేరకు ఉత్తమనెల్లూరు గ్రామంలో 23 అర్జీలు ప్రజల నుంచి స్వీకరించినట్లు చెప్పారు.

## తెల్లరేషన్ కార్డుదారులందరికీ కందిపప్పు

కోట, నవంబర్ 2 ప్రభాతవార్త

తెల్ల రేషన్ కార్డుదారులందరికీ నవంబర్ నెల నుంచి బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు అందించేలా కూటమి ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థపై దృష్టి పెట్టింది. అందులో భాగంగా జిల్లాలోని అన్ని పౌరసరఫరాల గోదాముల నుంచి కందిపప్పు నిల్వలను ఇప్పటికే తరలించారు. తిరుపతి జిల్లాలోని 6 లక్షల 307 కార్డు దారులకు ఒక్కో కేజీ చొప్పున కందిపప్పు అందించనున్నట్లు జిల్లా సివిల్ సప్లయిస్ ఆఫీసర్ రాజు చెప్పారు. కిలో కందిపప్పు రూ.180 వరకు మార్కెట్లో ఉండగా, పౌరసరఫరాల శాఖ ద్వారా కిలో రూ.67కే అందిస్తున్నారు. జిల్లాలోని ప్రతి తెల్లరేషన్ కార్డుదారుడు కందిపప్పు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## చురుగ్గా పశుగణన

**కోట, నవంబర్ 2 ప్రభాతవార్త** పశుగణన కార్యక్రమం కోట మండలంలో చురుగ్గా సాగుతోంది. 21వ అఖిల భారత పశుగణనలో భాగంగా ఈ ప్రక్రియ చేపట్టారు. గత నెల 25వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరగనుంది. ఇప్పటికే కోట మండలంలోని కొత్తపాలెం, చిట్టేడు, విద్యానగర్ గ్రామాల్లో పశు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో ఇంటింటా పశుగణన సర్వే నిర్వహిస్తున్నారు. పశు సంవర్ధక రంగాన్ని మెరుగుపరచడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఆయన చెప్పారు. అందుకు అవసరమయ్యే నిధులు, పథకాల రూపకల్పనకు ఈ పశుగణన ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్ళు, పక్షుల తదితర 16 రకాల జంతువుల వివరాలు సేకరిస్తున్నారు. నాలుగు నెలల పాటు సాగే పశుగణన కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, తమ వద్దకు వచ్చే అధికారులకు పూర్తి వివరాలు అందజేయాలని కోరారు.భవిష్యత్‌లో పాడి పరిశ్రమ అభివృద్ధికి రైతుల సంక్షేమానికి ఇది ఉపయోగపడుతుందని తెలిపారు.

## ప్రతి ఒక్కరికి వైద్యం అందించడమే జిఎన్ఆర్ సోషల్ సర్వీస్ ట్రస్ట్ లక్ష్యం

చైర్మన్ గంగోటి నాగేశ్వర రావు



**వెంకటగిరి, నవంబర్ 2, ప్రభాతవార్త** ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందించడమే జిఎస్ఆర్ సోషల్ సర్వీస్ ట్రస్ట్ లక్ష్యమని ట్రస్ట్ ఛైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వర రావు తెలిపారు. ఈ నెల 5వ తేది బర్డ్ ఆసుపత్రి విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ జగదీష్ ఆధ్వర్యంలో మెగా ఆర్థో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం ఆరు గంటల నఉండి 8 గంటల వరకు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. 20సంవత్సరాలుగాఉచితంగాజిఎన్ఆర్‌సోషల్‌సర్వీస్‌టెస్ట్‌ద్వారా విరివిగా సేవా నిర్వహిస్తున్నారు. ప్రజల కోసం ఉచిత ఆర్థో క్యాంపులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ జగదీష్ లక్ష మందికి పైగా ఆపరేషన్లను చేసి ఆయన రికార్డు సృష్టించారు. పేదల కోసం అంబులెన్సులు ఏర్పాటు చేశారు. బుక్స్ ఫీజులు కట్టడం వంటివి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వైద్య శిభిరం కోసం వచ్చేవారు పేరు నమోదు కొరకు 6303672977, 6281092306, 9640434462 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో అథ్లెటిక్ మీట్

**గూడూరు, నవంబర్ 2, ప్రభాతవార్త** నారాయణ ఇంజనీరింగ్ కళాశాల గూడూరులో అథ్లెటిక్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గూడూ రు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, నారాయణ ఫార్మసీ కళాశాల విద్యార్థులు 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 4/100 మీటర్ల రిలే, లాంగ్ జంప్, షాట్ ఫుట్, 4/100 మీటర్ల రిలే, జావెలిన్ త్రో తదితర ఈవెంట్స్ 700 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రారంభోత్సవంకి ముఖ్య అతిధిగా హాజరైన డిఎస్పి గూడూరు వివి రమణ కుమార్ మాట్లాడుతూ క్రీడలు మన జీవితంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఎందుకంటే ఇది మనల్ని ఆరోగ్యంగా, సంపన్నంగా చురుకుగా ఉంచుతుంది. ఆరోగ్యవంతమైన శరీరం ఉన్నప్పుడే మనం ఆరోగ్యక రమైన మనస్సును కలిగి ఉండగలమన్నారు. మన మన శారీరక, మానసిక శ్రేయస్సును కాపాడుకు న్నప్పుడు గొప్ప విజయాలు మానసిక శ్రేయస్సును కాపాడుకున్నప్పుడు గొప్ప విజయాలు మనకు వస్తాయ న్నారు. జాతీయ హాకీ క్రీడాకారుడు కె. భానుప్రకాష్ నెల్లూరు పోటీలలో గెలిచిన విద్యా ర్థులకు లేదా బ హుమతులు అందజేశారు. విద్యార్థులు ట్రోఫీలు లేదా బహుమతులు గెలుచుకునే లక్ష్యం తో తరచుగా పోటీక్రీడా కార్యకలాపాలలో పాల్గొనాలని తెలియజేశారు. పోటీలో బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ కళాశాల డైరెక్టర్ డా. దత్తాత్రేయశర్మ, ప్రిన్సిపాల్ డా. వి. రవిప్రసాద్, డీన్ డా. కె. విశ్వక్సేనరెడ్డి క్రీడలు మన సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయి. జీవితంలో ఉన్నత స్థాయిని తీసుకు వస్తాయని క్రీడలు మన నైపుణ్యాన్ని వెలికితీస్తాయి.స్వయంప్రతిపత్తికిక్రీడలుకీలకమని అని విద్యార్థులకు తెలియజేశారు.వివిధ విభాగాధిపతులు, ఫీజికల్ డైరెక్టర్స్ ఏఓ కొండారెడ్డి, ఎఓఎం అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రూ. 5 కోట్ల 28 లక్షలతో ఆర్అండ్‌బి రోడ్లకు మరమ్మతులు

ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్



**గూడూరు, నవంబర్ 2, ప్రభాతవార్త** గూడూరు నియోజక వర్గంలో గుంతమయంగా ఉన్న ఆర్అండ్‌బి రోడ్ల మరమ్మత్తుకు రూ. 5 కోట్ల 28 లక్షలతో చేస్తున్నామని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వం చేపట్టిన మిషన్ పాటోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమంలో భాగంగా చెన్నూరు - రాజంపేట రోడ్ గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన 65 లక్షల రూపాయిలు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 4 నెలలోనే రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి ప్రారంభించారు. రాష్ట్రంలో గుంతల మయంగా ఉన్న రోడ్లను పూడ్చే కార్యక్రమంను పండుగల లోపల పూర్తి అయ్యేలా చేయమని ముఖ్యమంత్రి అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గతంలో ఇక్కడే మేమే కూడా ఇదే రోడ్ల పై నిరసనలు తెలిపారు. ప్రభుత్వం స్పందించిన దాఖలాలు లేవన్నారు. అధికారంలోకి వచ్చిన వవెంటనే ఈ నాయకుని దృష్టికి రోడ్ల దుస్థితి తీసుకెళ్తే వెంటనే మంజూరు చేయించారు. కూటమి ప్రభుత్వంలో 5 కోట్ల 28 లక్షల రూపాయిలతో గుంతలమయంగా ఉన్న రోడ్లను పూడ్చే కార్యక్రమం చేపట్టామని అన్నారు. రోడ్డు గుంటలు పూడ్చే యంత్రం నడిపి మరమ్మతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, నాయకులు కరుణాకర్ రెడ్డి, శ్రీకి రెడ్డి శ్రీనివాసరెడ్డి, చిన్న వైఎస్ఆర్ నేలపల్లి భాస్కర్ రెడ్డి అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హత్య కేసులో ముద్దాయి అరెస్టు



వాకాడు, నవంబర్ 2, ప్రభాతవార్త వాకాడు మండలం పులింజేరిపాలెం గ్రామంలోని తండ్రిని హత్య చేసిన కేసులో తుపాకుల రమేష్‌ను పోలీసుల అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. శనివారం వాకాడు సర్కిల్ కార్యాలయంలో సిఐ హుస్సేన్ భాష విలేకరు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సిఐ హుస్సేన్ భాష మాట్లాడుతూ మండలంలోని పులిన్‌జెరి గ్రామంలోని తండ్రి చిన్న సుబ్బరామయ్య పై కుమారుడు తుపాకుల రమేష్ దాడి చేసి పరారైనాడు. వాకాడు ఎస్ఐ నాగబాబు, పోలీస్ సిబ్బంది ఆరా తీసి పట్టుకొన్ని అరెస్టు చేశామన్నారు. పపోలీస్ సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

## ప్రొఫైల్ యాప్ పై అవగాహన కలిగిఉండాలి

మెప్మా పిడి రాధమ్మ



**గూడూరు, నవంబర్ 2, ప్రభాతవార్త** స్వయం సహాయక ప్రొఫైల్ యాప్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని మెప్మా పిడి రాధామ్మ పేర్కొన్నారు. గూడూరు మున్సిపాలిటీలోని మెప్మా సివో, డిఈవో ఆర్పీలకు ఎస్‌హెచ్‌జి ప్రొఫైలింగ్ యాప్‌పై శిక్షణా కార్యక్రమాన్ని పిడి రాధమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా మెప్మా సైట్ నందు సభ్యులు, బ్యాంకులు మారినా ఏ ఇతర మార్పులు జరిగి వన్నా సైట్‌లో ఎలాంటి మార్పులు చేసేందుకు అవకాశం ఉండేది కాదన్నారు. నూతనంగా రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం మెప్మా సైట్‌లో మార్పుల చేర్పు చేసే ధ్రుడ సంకల్పంతో ఎస్‌హెచ్‌జి ప్రొఫైలింగ్ యాప్‌ను ప్రవేశ పెట్టిందని ఈఆర్పీలందరూ సభ్యులకు ఆన్‌లైన్ నందు వున్న ప్రతి గ్రూప్ డేటాను యాప్ నందు వున్న మొత్తం డేటాను సరిచూసుకొని కరెక్ట్ డేటానే అప్ లోడ్ చేయాలన్నారు. ప్రతి ఆర్పి రోజుకు 2 గ్రూపులు ఖచ్చితంగా చేయాలని గ్రూప్ డేటా అప్లోడ్ చేసే సమయంలో ప్రతి ఒక్క సభ్యురాలు వుండాలని తెలిపారు. పై డేటా అప్లోడ్ చేసిన తదుపరి కొత్త సభ్యుల డేటా ఇతర వివరాలు నమోదు చేయవచ్చని తెలిపారు. అందువల్ల ప్రతి ఆర్పి షెడ్యుల్ ప్రకారం డేటా నమోదు చేయాలని తెలిపారు. గూడూరు సిఎంఎం పెంచలయ్య, టిఈఐ బిల్ గోపి, కృష్ణవేణి, టియిఎల్ హెచ్ ప్రమీల, టియిఎస్ఎస్‌భాస్కర్, సివో చందన, డిఆర్‌పి వసంత, టిఎల్ఎఫ్ ఓబిలు, డిఈవో, ఆర్పీలు పాల్గొన్నారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతున్న రోగికి పింఛన్ అందజేత

**గూడూరు, నవంబర్ 2, ప్రభాతవార్త** గూడూరు పట్టణంలో ఒకటవ తేది నుండి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లకు పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. గూడూరు రెండవ పట్టణంలోని దిగువ వీరారెడ్డిపల్లికి చెందిన షేక్ అమీర్ బి మెదుడులో రక్తం గడ్డ కట్టి నెల్లూరు పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. 19వ వార్డు సచివాలయ అడ్మిన్ పాముూరు రమ్య పింఛన్ ఇచ్చేందుకు అమీర్ బీ ఇంటికెళ్లారు. అయితే ఆమె ఇంటికి తాళం వేసి ఉండడంతో చుట్టుపక్క ఇళ్లలో అడిగి అమీర్ బీ నెల్లూరులో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్నారు. సొంత డబ్బులతో నెల్లూరులోచికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నాలుగు వేల రూపాయిలు వృద్ధాప్య పింఛన్‌ను అమీర్ బీకి అందించారు. దీంతో ఆ కుటుంబ సభ్యులు సచివాలయ అడ్మిన్ రమ్యాకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇది పారదర్శక ప్రభుత్వం: మాట నిలబెట్టుకోంటోంది!



బొల్లినేని

శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 2 ప్రభాతవార్త

నేడు రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నది పారదర్శక ప్రభుత్వమని మండల తెలుగు దేశం నాయకుడు బొల్లినేని జగన్నాధం నాయుడు అన్నారు. శనివారం స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆదేశాలతో సూపర్‌సిక్స్ కార్యక్రమాల్లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణి కార్యక్రమాలను ఆయన పంచాయతీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఎన్నికల మెనిఫేస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయటంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. ఓ వైపు రాజధాని నిర్మాణం మరో వైపు పోలవం ప్రాజెక్టు నిర్మానానికి కేంద్రం నుంచి నిధులు రాబడుతూ నిరుపేదలకు ఇచ్చిన హామీ మేరకు నిరుపేదలకు ఎన్‌టిఆర్‌భరోసా కార్యక్రమాల్లోతంచన్‌గా 1వ తేది పెన్షన్లు అలాగే ధరలను క్రమబద్ధీకరించుటకు రేషన్ షాపుల ద్వారా కందిపప్పు, చక్కెర అందిస్తున్నారన్నారు. అంతేకాక ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇవ్వటానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ నేపధ్యంలోనే నేడుమనం ఇక్కడ ఉచిత సిలిండర్లను తీసుకుంటున్నామని బొల్లినేని జగన్నాధం నాయుడు అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటుసర్పంచ్ పర్యవేక్షించారు. గ్రామ కార్యదర్శి గోవిందస్వామి అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు.

## రోడ్డు ప్రమాదంలో రాంబట్లపల్లి వాసి మృతి

తొట్టంబేడు, నవంబర్ 2 ప్రభాతవార్త



రోడ్డు ప్రమాదంలో రాంట్లపల్లి వాసి సిహెచ్.మోహన్(41) తిరుపతిలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మోహన్‌రెడ్డి నారాయణాద్రి ఆస్పత్రి నుంచి తిరుచానూరు వెళ్ళే మార్గంలో పాలకోసం వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆవును తప్పించబోయి ప్రమాదవశాత్తు కిందపడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి అక్కడికక్కడే మృతిచెందాడు. తిరుచానూరు పోలీసులు కేసునమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మోహన్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

## గంగ కాలువలో పడి వ్యక్తి మృతి

తొట్టంబేడు, నవంబర్ 2 ప్రభాతవార్త

మండలంలోని చిన్నసింగమాల గ్రామం వద్ద నర్రావెంకటసుబ్బయ్య(48) సొంత పనుల కోసం మంగళవారం వెంకటసుబ్బయ్యపనులు ముగించుకుని వస్తుండగా పక్కనే ఉన్న గంగ కాలువ వద్ద కాళ్ళు చేతులుశుభ్రం చేసుకునేందుకు దిగగా ప్రమాదవశాత్తు కాలుజారిపడిపోవడంతో ఇంకా ఇంటికి రాని భర్తకోసం భార్య, బంధువులు గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. శుక్రవారం కెవిబిపురం మండలం కోవనూరు వద్ద గుర్తు తెలియని మృతదేహం బయటపడడంతో ముందుగానే పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. దీంతో కుటుంబసభ్యులు అక్కడకకు చేరుకుని మృతదేహం వెంకటసుబ్బయ్యదే అని తెలిపారు. మృతునికి భార్య లావణ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

## భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు

తొట్టంబేడు, నవంబర్ 2 ప్రభాతవార్త



భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలను నిర్వహిస్తున్నామని వీటిని గ్రామరెవెన్యూలో ఉన్న ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ యు.మధుసూధనరావు, డిఐ రాఘవయ్య, సర్వేయర్ కె.హరనాధ్‌లు పిలుపునిచ్చారు. గ్రామసభల్లో భాగంగా రీ సర్వేలో ప్రజల నుంచి పలు వినతులు వచ్చాయి. వాటిని వెంటనే పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలుతీసుకుంటుందని తహశీల్దార్ తెలిపారు. శుక్రవారం గుమ్మడిగుంట గ్రామంలో రీ సర్వేపై సమావేశాన్ని నిర్వహించిభూయాజమాన్య హక్కులు అన్నదాతలకు వారి భూములు ఎక్కడ వరకు ఉన్నాయో సమగ్రంగా తెలుసుకోవడానికే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చిన వినతులు సకాలంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో విఆర్ఓ రాఘవులు, గ్రామ సర్వేయర్లు, మరియు విజయ్‌లోకేష్, సుకన్య, అంజలి సత్యనారాయణ, కమ్యూనిటీ సర్వేయర్‌లు సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ మరియు రైతులు హాజరయ్యారు.

## ముచ్చివోలులో ఉచిత గ్యాస్ పథకం పంపిణీ

శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 2 ప్రభాతవార్త



మండలంలోని ముచ్చివోలు పంచాయతీలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీ అయినా సూపర్‌సిక్స్ లో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఉచిత గ్యాస్ పథకం ప్రవేశపెట్టిన సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసనసభ్యులు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి సూచనల మేరకు యూనిట్ ఇన్‌ఛార్జి నరసయ్య, బూత్ ఇన్‌ఛార్జి మురళీమోహన్‌రఎడ్డి, పార్టీ అధ్యక్షుడు కృష్ణమనాయుడు, ఎస్.నారాయణ, జె.సుబ్బారావు మహిళలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో గ్రామంలోని మహిళలకు పంపిణీచేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతోందన్నారు

## ప్రతి ఒక్కరు తెదేపా సభ్యత్వం తీసుకోండి

శ్రీకాళహస్తి, నవంబర్ 2 ప్రభాతవార్త



ప్రతి ఒక్కరు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవాలని పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్, 9వ వార్డు మాజీ కౌన్సిలర్ శెంజిగరసుప్రజ, శెంజిగరంవేలు, తిరుపతి పార్లమెంటు నాయకుడు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్‌మిన్నల్‌రవిల ఆధ్వర్యంలో తెలుగుదేశంపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా వార్డులో పలువురు ప్రజల ఇంటికి వెళ్ళి సభ్యత్వాన్ని నమోదు చేశారు. క్రియాశీల సభ్యత్వం రూ.100లు, శాశ్వత సభ్యత్వం రూ.లక్షగా నిర్ణయించామని సభ్యత్వనమోదు చేసుకున్న వారికి తెదేపా చేపట్టిన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. వార్డు ప్రజలు అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు వరం



శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 2 ప్రభాతవార్త

మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించడం వరమని మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు అన్నారు. శనివారం మండలంలోని మన్నవరం గ్రామంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తహశీల్దార్ లక్ష్మినారాయణ, ఎంపిడిఓ రఫిఖాన్ , ఎలక్షన్ డిటి రవికుమార్‌లు ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా చెంచయ్యనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విడదల వారీగా అమలుచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, మన్నవరం ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

విజయపురం, నవంబరు 2 ప్రభాతవార్త:

మండలంలోని మిట్టకండ్రిగ ప్రాథమిక పాఠశాలలో శనివారం రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. 1 నుంచి 5 వరకు చదువుతున్న విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్, నోటు పుస్తకాలు వితరణగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దివ్య, విద్యా కమిటీచైర్మన్ హేమలత, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ముత్తు, శివానందం తదితరులు పాల్గొన్నారు.

## మానవ మృగాన్ని శిక్షించండి - ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ



పుత్తూరురూరల్, నవంబరు 2 ప్రభాతవార్త:

వడమాలపేట మండలం ఏఎం పురం అబ్బికండ్రిగ గ్రామ పంచాయతీ యానాది కాలనీలో జరిగిన ఘోరాన్ని అందరూ ఖండించాలని, మూడున్నర సంవత్సరాల చిన్న బాలికపై సుశాంత్ అనే యువకుడు లైంగికంగా అనుభించి చంపేసి పాతి పెట్టిన సంఘటన చోటు చేసుకుంది. ఈ సందర్భంగా పుత్తూరు పట్టణంలో ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బాధిత కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని, వారి కుటుంబంలో ఇద్దరికి తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉద్యోగాలు కల్పించాల్సిందగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, రవి, సీఐటీయూ నాయకులు వెంకటేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వినోద్, నరేంద్ర, హర్షద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాట్ ఒలంపియాడ్ లో ప్రతిభ కనబరిచిన శ్రీ చైతన్య విద్యార్థులు

తిరుపతి విద్య, నవంబర్ 2 ప్రభాతవార్త:

స్థానిక న్యూ ఇందిరానగర్ శ్రీ చైతన్య పాఠశాల నందు క్యాట్ ఒలంపియాడ్ పరీక్షల్లో విద్యార్థులు విశేష ప్రతిభను ఘనపరిచారని ఆ విద్యాసంస్థల ఎజిఎం సురేష్ తెలిపారు. లెవల్ వన్‌లో ఉత్తీర్ణులై లెవల్ 2కి ఏకంగా 150 మంది విద్యార్థులు ఎంపికయ్యారని వెల్లడించారు. మ్యాట్ కు 59 మంది, ఫ్యాట్ కు 47 మంది, చాట్ కు 49 మంది ఎంపికయ్యారని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి జోనల్ కో ఆర్డినేటర్ ఏ బాలాజీ, జోనల్ డీన్ కాశిరావు, ఐకాన్ ఇన్చార్జి త్రిలోక్, వైస్ ప్రిన్సిపాల్ కీర్తి, ఎస్ బ్యాచ్ ఇంచార్జీ ఆమని ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ



తిరుపతి విద్య, నవంబర్ 2 ప్రభాతవార్త:

స్థానిక జోష్ ప్రాపర్టీస్ ఆఫీసు నందు అంతర్ జిల్లాల బాడీ బిల్డింగ్ పోటీలో పోస్టర్ ను గోల్డ్ ఇన్ ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వై ప్రవీణ్, నేషనల్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ ప్యాట్రన్ ఏ.ఈశ్వర ప్రకాష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎలమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ మెన్ ఫిజిక్ తో కూడా విమెన్ ఫిజిక్ మెన్ మోడలింగ్, విమెన్ మోడలింగ్ ఈ వెంట్లను ఈ సంవత్సరం జతపరచడం సంతోషకరమని అన్నారు. గోల్డెన్ ఇండియా ఫెడరేషన్ డైరెక్టర్ శివప్రసాద్ మాట్లాటుతూ తిరుపతి చిత్తూరు కడప. అన్నమయ్య జిల్లాల పోటీలను తిరుపతి నందు 1/12/2024 వ తేదీ నిర్వహించిన ఉన్నామని వీటిలో గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతితో పాటు మెడల్స్ ని సహకరించిన ఉన్నామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ క్రింద నెంబర్ కు సంప్రదించాలని తెలిపారు. ఫోన్ నెంబర్స్ 9505873777,7013274433. ఈ కార్యక్రమంలో జి.హరి, బద్రి, అరుణ్ కుమార్, ఈ.హరి తదితరులు పాల్గొన్నారు.

## దళిత ద్రోహి స్టార్ కృష్ణయ్య

తిరుపతి హెల్త్, నవంబర్ 2, ప్రభాతవార్త




దళితల ద్రోహి స్టార్ కృష్ణయ్య అని ఏఆర్‌కె ప్రజా సంఘం అధ్యక్షులు, బాధితుడు అత్తూరు రవికుమార్ ధ్వజమెత్తారు. అంబేద్కర్ పేరు చెప్పుకుంటూ దళిత కులాన్ని అడ్డుపెట్టుకుని దందాలు చేస్తూ స్వలాభపేక్ష కోసం నిరంతరం పనిచేసే కాకి కృష్ణయ్య సాటి దళితులను సైతం దగా చేశారని రేణిగుంట మండలం అత్తూరు గ్రామానికి చెందిన రవికుమార్ ఆరోపించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన స్టార్ కృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంస్థల్లో ఆర్టీసి బస్సు కండక్టర్‌గా పనిచేస్తున్న స్టార్ కృష్ణ అలియాస్ కాకి కృష్ణయ్య దళిత నాయకుడు అని చెప్పుకుంటూ ఏనాడు దళితుల పక్షాన పోరాడి దళితులకు న్యాయం చేసిన దాఖలాలు లేవన్నారు. అతనికి సమాజ సేవలు కంటే తన కుటుంబం ప్రయోజనాలు కోసం అక్రమ ఆస్తులు సంపాదించడమే లక్ష్యంగా ముందుకెళుతూ రూ. కోట్లు గడించారని విమర్శించారు. అతని వద్ద మోసపోయిన బాధితులు చాలా మంది ఉన్నారని తెలిపారు. అతని చేతిలో మోసపోయిన తాను కూడా ఓ బాధితుడని తెలిపారు. 2003 నవంబర్ 1న తన సొంత వదిన కొత్తూరు హరిత రోడ్డు ప్రమాద ఘటనలో మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. రోడ్డు ప్రమాదానికి కారకుడైన యజమానితో మధ్య వర్తం నడిపి అతని దగ్గర సొమ్ములు తీసుకుని ఒక వ్యక్తిని కోల్పోయిన కుటుంబాన్ని దగా చేసాడని ఆరోపించారు. సాధారణమైన ఆర్టీసి కండక్టర్‌గా ఉన్న కాకి కృష్ణయ్య రూ. కోట్లు ఆస్తి సంపాదించడం ఏంటని ప్రశ్నించాడు. కాకి కృష్ణయ్య పై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసారు. ఈ విలేకరుల సమావేశంలో వెంకటరమణ, గోవర్దన్, గోపి, సంతోష్ పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ని కలసిన చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు

తిరుపతి విద్య, నవంబర్ 02, ప్రభాతవార్త:



తిరుపతి జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కె.వి చౌదరీ కార్యదర్శి కె.రఘురామి రెడ్డి దీపావళి పండుగ సందర్భముగా తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్లు ఐఏఎస్ ని, జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సల్ ఐఏఎస్ పి కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భముగా వ్యాపారసంస్థలు, ఎంఎస్ఎంఇ లు అభివృద్ది కొరకు, నైపుణాభివృద్ధి(స్కిల్ డెవలప్మెంట్)విషయములు గురించి చర్చించుకున్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సానుకూలముగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## పశువైద్య కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

తిరుపతి విద్య, నవంబర్ 02, ప్రభాతవార్త:



వెంకటేశ్వర పశువైద్య వర్సిటీ లో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. 2024 సంవత్సరంలో మొదటి సంవత్సరం బివిఎస్ సీ అండ్ ఏహెచ్ డిగ్రీ అడ్మిషన్ పొందిన 81 మంది విద్యార్థులకు పశు వైద్య కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా ఉత్కష్ట పేరున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా వీర బ్రహ్మయ్య వెటర్నరీ డీన్ పశువైద్య వర్సిటతీ, కే నాగేశ్వరరావు డైరీ డీన్ పశు వైద్య వర్సిటీ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలేజీ క్యాంపస్ ర్యాగింగ్ రహితమని ఈ కాలేజీలో అత్యంత ఆధునిక వసతులతో కూడిన బోధన సదుపాయాలు ఉన్నాయని నూతనంగ ఆడ్మిషన్ పొందిన విద్యార్థులు బాగా చదివి అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. తరువాత జగపతి రామయ్య మాట్లాడుతూ ఈ కాలేజీలో ఉన్న బోధనా వసతులు, హాస్టల్ వసతులు, వారి అకడమిక్ వ్యవహారాలు వివిధ పథకాలు అండ్ అవార్డులు గురించి వివరిస్తూ విద్యార్థిని విద్యార్థులు అందరూ చక్కగా చదివి వివిధ రంగాలలో అత్యున్నత స్థాయికి చేరాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## సాంస్కృతిక వేదికను ప్రారంభం:

శ్రీకాళహస్తి, నవంబర్ 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయలో కార్తీక మాసం ఓ కొత్తదనం కల్పించుటకు ఇఓ చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశించారు. అంతేకాక ఊరంతా దీపాల కాంతిని నింపారు. కూడళ్ళలో విద్యుత్ దేవతలను ఆవిష్కరించారు. అంతేకాక సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు, ప్రజలు వీక్షించే రీతిలో రాజగోపురం పక్కన ఉన్న మండపంలో వేదికను ఏర్పాటు చేసారు. ఇక మీదట సాంస్కృతిక కార్యక్రమాలను ఇక్కడే నిర్వహించుటకు నిర్ణయించారు. ఈ వేదికను శనివారం ఆలయ డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు ఎఇఓ సతీష్‌మాలిక్, డిఇఇ శ్రీనివాసులు రెడ్డి దుర్గా ప్రసాద్, అవినాష్, స్వర్ణమూర్తి తదితరులు హాజరయ్యారు.

## జిల్లా జడ్జిని సత్కరించిన బార్ అసోసియేషన్

శ్రీకాళహస్తి, నవంబర్ 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ సారధ్యంలో జిల్లా జడ్జి భీమారావును ఘనంగా సత్కరించి తమ సమస్యలను వివరించారు. జిల్లా జడ్జి భీమారావు శనివారం శ్రీకాళహస్తిలోని సబ్‌కోర్టును ఆకస్మికంగా పరిశీలించారు. ఆయన్ను బార్ అసోసియేషన్ సారధ్యంలో సత్కరించగా ఆయన న్యాయవాదులకు సూచనలిస్తూ ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు ప్రతి ఒక్క న్యాయవాది కృషి చేయాలని సూచించారు. పేదలు వచ్చినపుడు న్యాయస్థానంపై గౌరవం పెరిగే విధంగా న్యాయవాదులు సంతృప్తి పరచాలన్నారు. ఈకార్యక్రమాల్లో మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కన్నల ప్రభాకర్, కొండేటి కుమార్, న్యాయవాదులు వేదాం మల్లికార్జున్, గుమ్మడి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## రహదారులు మన నాగరికతకు చిహ్నాలు:బొజ్జల

శ్రీకాళహస్తి, నవంబర్ 2 ప్రభాతవార్త



రహదారులు మన నాగరికతకు చిహ్నాలని అందుకే ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, డెప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌క ళ్యాణ్‌లు గ్రామీణ రోడ్లతో పాటు పట్టణంలోని రోడ్లకు మహర్దశ కల్పించుటకు నిధులు మంజూరు చేసారని శాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎపి సీడ్స్ కూడలి వద్ద రోడ్ల మరమ్మత్తులకు భూమి పూజలు చేసిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రహదారులు చక్కగా ఉండాలని పిలపు నిస్తూ ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రిలు రూ.700కోట్లు పై చిలుకు నిధులు మంజూరు చేసారన్నారు. సంక్రాంతి నాటికి రోడ్లుపై గతుకులు కనబడకుండా మరమ్మత్తులు చేయటానికి ఆదేశించారన్నారు. దూర దృష్టి కల్గిన ముఖ్యమంత్రి 2047 విజన్‌తో పని చేస్తున్నారని వివరించారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి దూర ప్రాంతాల నుంచి వేలాది మంది వస్తుంటారన్నారు. అందుకే తిరుపతి-శ్రీకాళహస్తిల మధ్య ఆరేలేన్ల రహదారులతో ప్రయాణాన్ని సుగమం చేస్తున్నారన్నారు. అంతేకాక శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని రోడ్లకు సింగారాలు కల్పించుటకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. శ్రీకాళహస్తి రూపు రేఖలను తీర్చి దిద్దుతామన్నారు. ప్రజల మనోభావాలకు తగ్గట్లు తన తండ్రి అందించిన సుపరిపాలన కన్నా మిన్నగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు మాజీ మార్కెట్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు దేశం కార్యకర్తలు, ఆర్‌అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

## క్రీడా సౌకర్యాల కల్పనపై దృష్టి

తిరుపతి క్రీడ, నవంబర్ 2, ప్రభాతవార్త

క్రీడా సదుపాయాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాఫ్) చైర్మన్ అనిమిని రవి నాయుడుని తిరుపతిలోని శాప్ క్యాంపు కార్యాలయంలో పలువురు క్రీడాకారులు కలిశారు. ఇటీవల రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన పలు రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు శాప్ చైర్మన్‌ని కలిసి తాము సాధించిన అవార్డులు, మెడల్స్‌ను చూపించారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ క్రీడాకారులను ప్రశంసించి భవిష్యత్తుల్లో మరిన్ని పతకాలు సాధించి దేశ కీర్తి ప్రతిష్టతలను పెంచాలని అభినందించారు. అలాగే క్రీడాకారులందరికీ శాఫ్ నుంచి పూర్తి స్థాయిలో సహకరిస్తామని ఆయన భరోసానిచ్చారు.



## పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్న పట్టించుకోరా

పాకాల, నవంబర్ 2, ప్రభాతవార్త

పాకాల మండలం దామలచెరువు టౌన్ నందు ప్రతి రోజు పగలంతా వీధి దీపాలు వెలుగుతూ ఉన్నాయి. గత కొంత కాలంగా ఇదే పరిస్థితి టౌన్‌లో నెలకొని ఉందని స్థానికులు అంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రాత్రి వేళలో మాత్రమే వీధి దీపాలు వెలిగే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలకు శ్రీకారం



**రేణిగుంట, నవంబరు 2 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం రేణిగుంట పట్టణంలో ఎమ్మెల్యే వెంకట సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియకు శనివారం శ్రీకారం చుట్టారు. టీడీపీ సీనియర్ నేత, మైనారిటీ నాయకులు మునీర్ జీకే, శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు అఫ్రోజ్ ఆధ్వర్యంలో ప్రక్రియ ప్రారంభమైంది. విశేష సంఖ్యలో ప్రజలు పార్టీ సభ్యత్వం నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు టీడీపీ సభ్యత్వం తీసుకోవాలన్నారు. తద్వారా ఎన్నోప్రయోజనాలతో పాటు బీమా సౌకర్యం ఉంటుందన్నారు. ఎన్నికల మేనిఫెస్టో సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా ఒక్కొక్క పథకాన్ని అమలుపరస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబును అభినందించారు. ఉచిత గ్యాస్‌సిలిండర్ల దీపం-2 పథకాన్ని అమలుపరచి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపారని పార్టీ అధినేతను కొనియాడారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా దర్బార్లు నిర్వహిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు.

## పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్త వహించండి

పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం



**సత్యవేడు, నవంబరు 2 ప్రభాతవార్త:** సత్యవేడు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(బాలుర)లో శనివారం ఫిరోజ్ డెంటల్ ఆస్పత్రి తిరుపతి వారిచే ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు పాండురంగయ్య మాట్లాడుతూ డాక్టర్లు ఫిరోజ్ బాబు, దేవరాజులు, ఈ ఉచిత శిబిరంలో ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులను పరీక్షించారని తెలియజేశారు. 200 మందిని పిల్లలను పరీక్షించి 53 మంది పిల్లలకు ట్రీట్‌మెంట్ అవసరమని మిగతా పిల్లలకు దంత సంరక్షణ జాగ్రత్తలు, ఉచితంగా పేస్ట్ ఇచ్చామని తెలిపారు. ఈ ట్రీట్‌మెంట్ అవసరమైన వారందరికి తిరుపతిలోని తమ ఆస్పత్రిలో ఉచితంటా ట్రీట్‌మెంట్ ఇవ్వనున్నట్లు తెలియజేశారు. అంతేకాకుండా ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉద్యోగులకు మా ఆస్పత్రిలో ఈహెచ్ఎస్ సౌకర్యం కలదని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేవ్వరులు, వై.వి.ఎల్.కుమార్, అన్వర్ బాషా, మనోహర్, ఎం.భాస్కర్, కృష్ణయ్య, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## ఏడాదికి మూడు సిలెండర్లు ఉచితం

తహశీల్దార్ శివసుబ్బరామయ్య



చంద్రగిరి, నవంబర్ 2 ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దీపం-2 పథకం ద్వారా ఏడాదికి 3 సిలెండర్లు పేదలకు అందించనున్నట్లు తహశీల్దార్ శివసుబ్బరామయ్య తెలిపారు. స్థానిక పాతపేటలోని సాయి బాలాజీ హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీలో శనివారం మహిళలకు గ్యాస్ సిలెండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలలో ఒకటైన ఉచిత గ్యాస్ సిలెండర్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్యాస్ బుక్ చేసుకున్న సమయంలో మీరు చెల్లించిన మొత్తాన్ని 48 గంటల్లో మీ అకౌంట్‌లో జమచేయబడుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఒక కుటుంబం గ్యాస్‌ను సరిగ్గా వినిగించుకోగలిగితే ఏడాదికి 3 సిలెండర్లు దాదాపుగా సరిపోగలవని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న దీపం-2 పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఇన్‌చార్జ్ శేఖర్, గ్యాస్ ఏజెన్సీ నిర్వహకులు బాలాజీ, కుసుమకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలకు గురి చేస్తున్న పిచ్చి మొక్కలు

విజయపురం, నవంబరు 2 ప్రభాతవార్త:



రోడ్డు చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు తరచూ ప్రమాదాలకు గురిచేస్తుందని గ్రామస్తులు ఆరోపిస్తు న్నారు. మండలంలో నగరి- కన కమ్మసత్రం, చిన్న జంబాడ- నారపరాజు కండ్రిగ, ఎం అగరం-కేవీ పురం, కాళికాపురం-బుగ్గ ఇళ్ళత్తూరు రోడ్డు చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడం వలన మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు సంబవిస్తున్నాయని గ్రామస్తులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చి మొక్కలు ఏపుగా రోడ్డుకిరు వైపులా పెరిగిపోవడం వలన ఎదురుగా వచ్చే వాహనాలు కనిపిం చడం లేదని, దగ్గరకు వచ్చి వాహనాలు చూసేసరికి ప్రమాదాలు జరిగిపోయి ఉంటుందని వాపోతున్నారు. ఈ విషయమై అధికారులు చర్యలు తీసుకోవానలి గ్రామస్తులు కోరుతున్నారు.

## మద్యం బాటిళ్ళు స్వాధీనం

శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 2 ప్రభాతవార్త



ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఊరందూరు రైల్వేగేట్ వద్ద బెల్టుదుకాణాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న సిఐ లావణ్య తమ సిబ్బందితో దుకాణాలను తనిఖీచేయగా ఎస్.గిరిబాబు (33) అనే వ్యక్తి వద్ద మద్యం బాటిళ్ళు అమ్ముతుండగా పట్టుకుని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 20 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I,**AEPURU ANNAPOORNA W/o AEPURI ROSI REDDY**(Old Name)R/ at D.No.6-120, Dhanalakshmi Nagar, Avilala, Tirupati Dist, AP. I have Changed my name to **APURU ANNAPOORNA** W/o **APURU ROSI REDDY** (New Name)

# ఇద్దరు దారి దోపిడీ దొంగలు అరెస్ట్

## -నాలుగు మోటారు సైకిళ్ళు, సెల్‌ఫోన్ స్వాధీనం

కాణిపాకం, నవంబర్ 2 ప్రభాతవార్త: కాణిపాకం పోలీస్ స్టేషన్ పరిధిలోని తిరుపతి-బెంగుళూరు సిక్స్‌లేన్ రోడ్డు బొమ్మసముద్రం ఫ్లైఓవర్ వద్ద గత నెల 29న జరిగిన దారిదోపిడి కేసులో ఇద్దరు దొంగలను శుక్రవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు తెలిపారు. శనివారం కాణిపాకం పోలీస్ స్టేషన్ ఎస్సై ధరణీధరతో కలసి విలేకరులతో మాట్లాడుతూ బొమ్మసముద్రం గ్రామపంచాయతీ తిమ్మోజిపల్లెకు చెందిన వెంకట ముని అనే వ్యక్తి జిల్లా కేంద్రం చిత్తూరులో ఎలక్ట్రికల్ వైడింగ్ షాపును నిర్వహిస్తున్నాడు. ఇతను గత నెల 29న రాత్రి సుమారు తొమ్మిదిన్నర గంటలకు మోటారు సైకిల్‌పై ఇంటికి వస్తుండగా దొమ్మసముద్రం ఫ్లైఓవర్ వద్ద ఇద్దరు వ్యక్తులు దాడి చేసి కొట్టి వెంకటముని వద్ద నున్న సెల్‌ఫోన్, 16 వేల రూపాయల నగదు, మోటారు సైకిల్‌ను చోరీ చేసి పరారయ్యారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు దర్యాప్తు చేపట్టి శుక్రవారం ఎం.పైపల్లె సిక్స్‌లేన్ రోడ్డు చిత్తూరు జానకారపల్లెకు చెందిన సింగమలై అలియాస్ అజయ్, శ్రీధర్‌నాయుడు, ఎస్సై ధరణీధరలు తెలిపారు. ఎక్కడైన నేరాలు జరిగితే వెంటనే తమక సమాచారం అందిస్తే నిందతులను వెంటనే పట్టుకోవడానికి వీలుంటుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



దారిదోపిడి కేసులో నిందితులను అరెస్ట్ చూపుతున్న సీఐ

రజనిలను అరెస్ట్ చేసి దోపిడీకి గురైన మోటారు సైకిల్‌తో పాటు మరో మూడు మోటారు సైకిళ్ళు, సెల్‌ఫోన్, నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీధర్‌నాయుడు తెలిపారు. అరెస్టయిన ఇద్దరు నిందితులు గతంలో గుడిపాల, యాదమరి మండలాల్లో జరిగిన దోపిడి కేసుల్లో నిందితులుగా వున్నట్లు తెలిపారు. జాతీయ రహదారిలో దారి దోపిడీలను అరికట్టేందుకు హైవే పెట్రోలింగ్ ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రాత్రి వేళల్లో ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, బంగారు ఆభరణాలను ధరించి వెళ్ళరాదని, ఒంటరి మహిళలు ఇళ్ళ వద్ద జాగ్రత్తగా వుండాలని సీఐ

## మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఘన స్వాగతం



రేణిగుంట, నవంబరు 2 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా ఆయన శనివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయంలో మంత్రికి శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సివిల్ సప్లయ్ డీఎం సుమతి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజు, రేణిగుంట తహసీల్దార్ శ్యాంప్రసాద్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనందకుమార్, జనసేన జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్, జనసేన యూత్ నేత కిరణ్ రాయల్, శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కోట వినుత, జనసేన నాయకులు కోట చంద్రబాబు, రాజారెడ్డి, జనసేన సీనియర్ నాయకులు నగరం భాస్కర్‌బాబు, స్థానిక జనసేన నేతలు భాగ్యలక్ష్మి, బాలాజీ, నాగముని, అనురాధ, శ్రీనివాసులు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి రోడ్డు మార్గంలో తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

## నేడు కొత్త ఇఓ బాపిరెడ్డి బాధ్యతల స్వీకరణ

### సంస్కరణలు కొనసాగుతాయా? లేక మార్పులు చేర్పులుంటాయా?



శ్రీకాళహస్తి, నవంబర్ 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓగా బాపిరెడ్డి ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్త ఇఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న బాపిరెడ్డి గత 40రోజులుగా ఆర్‌జెసి పరిపాలనలో ఎన్నో సంస్కరణలు అమలు చేసారు. సంప్రదాయ, సంస్కృతులకు సంబంధించి ఎన్నో అమలు చేసారు. గాడితప్పిన పాలనను 40రోజుల్లో చక్కదిద్దటంలో తన మార్కును చూపారు. కొన్ని సఫలీకృతులయ్యారు. ముఖ్యంగా స్థానికులకు ఆధార్‌కార్డుతో సమయం ప్రకారం దర్శనాలు, అలాగే రాహుకేతుదోష నివారణ పూజల్లో డ్రెస్ కోడ్‌లాంటి వివాదాస్పద నిర్ణయాలను ఎలా చేస్తారనేది చర్చనీయాంశంగా మారింది. అంతేకాక గతంలో పలు సంస్కరణలు సత్ఫలితాలనిచ్చాయి. అందులో ముఖ్యంగా ఆలయంలో దళారుల దందాకు చెక్ టెండర్ల మాఫీయాకు చెక్, కార్‌పార్కింగ్‌లో కంప్యూటర్ బిల్లింగ్, ఇక అన్ని కౌంటర్లలో కంప్యూటరైజ్ చేసారు. ఇలా కొన్ని సంస్కరణలు చేపట్టారు. ముఖ్యంగా శ్రీకాళహస్తీశ్వరా లయంలో గతంలో మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి నిర్ణయం తీసుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకలు సుమారు రూ. వంద కోట్లు వెచ్చించారు. సుమారు ఆరు మంది ఇఓలు మారినా ఓ కొలిక్కి రాలేదు. ప్రస్తుతం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఎలాగైనా మాస్టర్‌ప్లాన్‌ను అమలు చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. అలాగే ఆలయానికి సంబంధించిన శివం టు శివం రోడ్డు పనులు టెండర్లు అయ్యాయి. అమలు జరగాల్సి ఉంది. ఆలయాన్ని అవినీతి రహితంగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో ఉన్నారు. ఇలా ఎన్నో సంస్కరణలు చేపట్టాల్సి ఉంది. కొత్తగా బాధ్యతలు స్వీకరించే ఇఓ బాపిరెడ్డి మీద ఎన్నో బాధ్యతలున్నాయి. ఆదివారం ఉదయం 7.30 బాధ్యతలు స్వీకరించనున్నారు.

### నేడు వైసిపి తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడుగా

## భూమన ప్రమాణస్వీకారం

### -తిరుపతి 150 బై పాస్ రోడ్డు పక్కన సభా ప్రాంగణం

తిరుపతిరూరల్, నవంబర్ 2 ప్రభాతవార్త: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడుగా భూమన కరుణాకర్‌రెడ్డిని ఆపార్టీ అధినేత వైయస్.జగన్మోహన్‌రెడ్డి నియమించిన విషయం విదితమే. ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడుగా భూమన కరుణాకర్‌రెడ్డి ఆదివారం 150 బై పాస్ రోడ్డు అవిలాల దగ్గర ప్రమాణస్వీకారం చేయనున్నారు. భూమన ప్రమాణస్వీకార మహోత్సవానికి ఉమ్మడి జిల్లాల నుండి పెద్దఎత్తున వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరానున్నారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. వైసిపి రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత మొదటిసారిగా నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయటానికి కృషి చేస్తున్నారు. భూమన ప్రమాణస్వీకారానికి వైసిపి ప్రధాన నాయకులు హాజరుకానున్నట్లు సమాచారం. ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున తరలివస్తారని తెలిపారు.

## విజిలెన్సు అవగాహన వారోత్సవాల ర్యాలీ

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 2, ప్రభాతవార్త : రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్మెంట్ డీజీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు విజిలెన్సు అవగాహన వారోత్సవాల్లో భాగంగా తిరుపతి రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్మెంట్ అధికారి కరీముల్లా షరీఫ్, ఎస్పి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎస్సీ, ఎస్టీ, బిసి సంక్షేమ శాఖ హాస్టల్స్ విద్యార్థినులు పాల్గొని కరపత్రాలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో అధికారులు, హాస్టల్ వార్డెన్‌లు పాల్గొన్నారు.

## డ్రోన్లతో మందులు పిచికారి చేస్తున్నాం : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 2 ప్రభాతవార్త : దోమల లార్వాలు వృద్ధి చెందకుండా, నియంత్రించడానికి డ్రోన్లతో మందులు పిచికారి చేస్తున్నామని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని వినాయక సాగర్ వద్ద శనివారం డ్రోన్లతో మందును పిచికారి చేసే రెండవ విడత కార్యక్రమాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మౌర్య మాట్లాడుతూ నగరంలో దోమల నివారణకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామన్నారు. అయితే మనుషులు కూడా వెళ్లలేని ప్రాంతాల్లో దోమల లార్వాలు వృద్ధి చెందుతున్నట్లు గుర్తించామని అన్నారు. అటువంటి ప్రాంతాల్లో దోమల లార్వాలు వృద్ధి చెందుతున్నట్లు గుర్తించామని అన్నారు. అటువంటి ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా మందులు పిచికారి చేస్తున్నామని అన్నారు. నిల్వ నీటిలోని దోమ లార్వాలను నాశనం చేసేందుకు ఆయిల్ బాల్స్ వేస్తున్నామని, ప్రతిరోజు సాయంత్రం ఫాగింగ్ చేస్తున్నామని అన్నారు. ఇలా దోమల పెరుగుదలను నియంత్రించవచ్చునని అన్నారు. అధికారులు గుర్తించిన దోమల వృద్ధి ఎక్కువగా ఉన్న 32 ప్రాంతాలతో పాటు మొత్తం 209 ఎకరాల్లో పైరోసిస్ ఆయిల్ ఎమల్సన్ మందును 1.4 నిష్పత్తిలో పిచికారీ చేస్తున్నామని అన్నారు. ప్రతి రోజూ 20 ఎకరాల్లో ఈ మందులు చల్లే కార్యక్రమం చేస్తామని అన్నారు. 15 రోజులకు ఒకమారు ఈ స్ప్రేయింగ్ చేస్తున్నామని అన్నారు. కమిషనర్‌తో పాటు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, సెక్రటరీ అజయ్ తదితరులు ఉన్నారు.

## చిన్నారి కుటుంబాన్ని నేడు హోంమంత్రి పరామర్శ

వడమాలపేట, నవంబరు 2 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా వడమాలపేట మండలం ఏఎం పురం ఎస్టీ కాలనీలో అత్యాచారం, హత్యకు గురైన చిన్నారి కుటుంబాన్ని హోంమంత్రి వంగలపూడి అనిత ఆదివారం పరామర్శిస్తారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్‌ని స్వయంగా అందజేయనున్నారు. అభం, శుభం తెలియని చిన్నారికి చాక్లెట్లు ఆశ చూపి దారుణానికి పాల్పడిన నిందితుడిని చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తామని బాధిత కుటుంబాన్ని కలసి స్వయంగా ఆమె భరోసా అందించనున్నారు.

## ఆధ్యాత్మికనగరంలో... భక్తితో నగరసంకీర్తన





తిరుపతి, నవంబర్ 2 ప్రభాతవార్త: ఆధ్యాత్మికనగరం తిరుపతిలో రాయలసీమ రంగస్థలి ప్రతి శనివారం ఉదయం నిర్వహించే నగర సంకీర్తన భక్తుల్లోనూఆధ్యాత్మిక భావం పెంపొందించేలా ఉందని రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. శనివారం వేకువజామున నగరసంకీర్తనలో భాగంగా గోవిందరాజస్వామి ఆలయ మాఢవీధుల్లో రంగస్థలి కళాకారులు గుండాల గోపీనాథరెడ్డి, సుశీల, మునికుమారి, పద్మావతి, కల్పన, ఉషారాణి, పార్వతి, ధనలక్ష్మి, నిర్మలవాసురెడ్డి, మునినాథరెడ్డి, శాంభోలు హరినాథ్, పొన్నాల జేజిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, నరసింహారెడ్డి, నాగరాజు, రాజశేఖర్‌రెడ్డి, వాసు, సాయిరెడ్డికల్యాణి, జయమ్మ. పద్మావతి తదితరులు కళాకారులతో కలసి నుదుటిన నామం ధరించి భక్తితో భజనలతో నగరంలో గోవింద నామ సంకీర్తనలు హోరెత్తాయి. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు అందించారు.

## కార్తీక మాస అమ్మవారి దర్శనంలో మాజీ మంత్రి రోజా



నగరి, నవంబరు 2 ప్రభాతవార్త: నేత్ర ప్రదాయణి దేశమ్మ దేవత కార్తీకమాస దర్శన పూజల్లో మాజీ మంత్రి రోజా పాల్గొన్నారు. శనివారం ఆలయానికి వెళ్లిన ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ పూజారులు ఆమెకు ఆలయ మర్యాదలు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ వేణుబాబు, దయానిధి, కౌన్సిలర్ ఇంద్రయ్య, కో-ఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి, నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ కట్టడికి పక్కా చర్యలు

## - జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి



బాల కార్మిక వ్యవస్థ జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం

చిత్తూరు, నవంబర్ 2 ప్రభాతవార్త: జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను కట్టడి చేయడానికి పక్కాగా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఛాంబర్ ఆవరణ లోని సమావేశ భవనంలో బుధవారం జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి బాల కార్మిక వ్యవస్థకు సంబంధించి జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ ముఖ్యంగా బాల కార్మికులు ఇతర ప్రాంతాల నుండి ఇక్కడికి వలస రావడం జరుగుతుంద న్నారు. అలాగే హోటల్స్, హాస్పిటల్స్ తదితర ప్రదేశాల్లో బాల కార్మికులు వున్నట్లైతే వారిని గుర్తించాలన్నారు. నగర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎక్కువగా వున్న ప్రదేశాల్లో బాల కార్మికులు ఎక్కువగా కన్పిస్తుంటారన్నారు. ఇలాంటి బాల కార్మికుల తల్లిదండ్రులతో చర్చించి వీరిని పాఠశాలకు పంపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే బాల కార్మికులు వున్న ప్రాంతాలను గుర్తించి వారు విద్య అభ్యసించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ కార్యక్రమంను విజయవంతంగా నిర్వహించాలన్నారు. అలాగే బాల్య వివాహాలు చేసుకున్న అమ్మాయిల్లో ఎక్కువ మెటర్నల్ డెత్స్ జరుగుతా యని, ఈ అంశంపై క్షేత్ర స్థాయిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి బాల్య వివాహాలు జరుగకుండా అడ్డుకట్ట వేయాలన్నారు. వివాహ వయస్సు రాక ముందే వివాహం చేయడంతో వచ్చే ఆరోగ్య సమస్యలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. జిల్లాలో ప్రధానంగా కర్నాటక రాష్ట్రానికి సరిహద్దుగా వున్న కుప్పం, పలమనేరు ప్రాంతాల్లో ఈ సమస్యను కట్టడి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పోలీసు శాఖను సమన్వయం చేసుకుని గ్రామ సచివాలయాల్లోని మహిళా పోలీసులు బాల్య వివాహాలు జరుగకుండా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఎపిసి వెంకటసుబ్బారెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతిదేవి, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి, జిల్లా కార్మిక శాఖ అధికారి ఓంకార్, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వితంతువులకు పెన్షన్ ఎప్పుడు

### - కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా కనికరించని అధికారులు- పెన్షన్ ఇప్పించి ఆదుకోవాలంటున్న వృద్ధురాలు



చిట్టమూరు, నవంబర్ 2 ప్రభాతవార్త : గత వైసీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి తేడా ఏముందని ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో మంజూరుకాని కొత్త పెన్షన్లు నేటికీ కార్యాలయాల పుస్తకాల్లోనే మగ్గుతున్నాయే తప్ప మంజూరుకు నోచుకోక పోవడంపై పలువురు బాధితులు వాపోతు న్నారు. చిట్టమూరు మండల వ్యాప్తంగా ఉన్న సచివాలయాల పరిధిలో వృద్ధాప్య, వితంతు, వికలాంగులు తదితర పెన్షన్లు వందల సంఖ్యలో ఆగిపోయి ఉన్నాయి. అధికారులు ఇదిగో చేస్తాం.. అదిగో చేస్తాం.. అంటూ కాలయాపన చేస్తూ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారే తప్ప తమ సమస్యలకు పరిష్కారం లభించడం లేదన్నది బాధితుల వాదనగా ఉంది. అరవపాలెం పంచాయతీ పరిధిలోని దరకాస్తు గ్రామానికి చెందిన మల్లి చెంగమ్మ అనే వృద్ధురాలికి భర్త చనిపోయి రెండు సంవత్సరాలు కావస్తున్నా నేటికీ పెన్షన్ మంజూరు కాకపోవడం, మరోవైపు ఆదరించే వారు కరువవడంతో దుర్భర జీవితాన్ని అనుభవించక తప్పడం లేదు. అలాగే ఇప్పటికే వైసీపీ ప్రభుత్వంలో అర్హుల కన్నా అనర్హులకే పెన్షన్లు ఇచ్చారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి సర్కార్ కొలువు తీరిన నాడే దొంగ పింఛన్లు ఏరివేసి అర్హులందరికీ న్యాయం చేస్తామన్న మాటలు నేటికీ కార్యరూపం దాల్చలేదు. జిల్లాస్థాయి అధికారులు పెన్షన్ కోసం ఎదురు చూసే వారి కష్టాలను గుర్తెరిగి అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

## ఉల్లాసంగా శేష జీవితం : ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, నవంబర్ 2 ప్రభాతవార్త: పోలీసు శాఖలో 43 సంవత్సరాల పాటు అంకితభావంతో విధులు నిర్వర్తించి రిటైర్డ్ అయిన ఉద్యోగులు శేష జీవితంను ఉల్లాసంగా గడపాలని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. పోలీసు శాఖలో అక్టోబర్ నెలలో రిటైర్డ్ అయిన బైరెడ్డిపల్లి హెడ్‌కానిస్టేబుల్ అశోక్, ఔట్ సోర్సింగ్ క్లాస్-4 ఉద్యోగిని వెంకటాయ్యమలను శనివారం చిత్తూరు పోలీస్ గెస్ట్‌హౌస్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ మణికంఠ చందోలు సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ పోలీసు శాఖలో విధులు నిర్వర్తించడం సవాలుతో కూడుకున్నదని, కుటుంబ జీవితంను త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తించిన వారిని పోలీసు శాఖ ఎప్పటికి గుర్తు వుంచుకుంటుందన్నారు. పోలీసు శాఖలో విధుల్లో చేరినప్పటి నుండి అప్పటి పరిస్థితులను తట్టుకుని కుటుంబానికి దూరంగా వుంటూ విధులు నిర్వర్తించడం సాధారణ విషయం కాదన్నారు. పదవి విరమణ అనంతరం సైతం రిటైర్డ్ అయిన వారు పోలీసు కుటుంబ సభ్యులేనని ఎలాంటి సమస్య వచ్చినా తనను సంప్రదించాలన్నారు. విశ్రాంత పోలీసులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఆరోగ్యపరంగా అత్యవసర సమయాల్లో వైద్యం కోసం వెళ్ళడానికిఇక ఒక వాహనం ఏర్పాటు చేశామని, ఈ వాహనం ఎల్లప్పుడు అందుబాటులో వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమానికి ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఆర్.శివనంద కిషోర్, ఏఆర్ డిఎస్పీ మహబూబ్‌భాషా, ఆర్ఐలు భాస్కర్, సుధాకర్, చంద్రశేఖర్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు ఉదయ్‌కుమార్, పదవి విరమణ చెందిన వారి కుటుంబసభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి గొలుసు లాక్కెళ్ళిన దుండగులు



చౌడేపల్లి, నవంబర్ 2 ప్రభాతవార్త : చిరునామాను అడుగుతున్నట్లుగా మాయమాటలు చెబుతూ ఓ వృద్ధురాలి మెడలోంచి బంగారం చైను తస్కరించు కొని వెళ్ళిన సంఘటన శనివారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధితురాలు కుమారుడు శివశంకర కథనం మేరకు...చౌడేపల్లి పట్టణ పరిధిలోని గడ్డం వారిపల్లి మార్గంలో బైపాసిఫంక్షన్ హాలువద్ద రాజమ్మ (80)నివశిస్తోంది. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి రాజమ్మ ఇంటిముందు ఉండగా పక్కనే వున్న చిల్లర దుకాణం దారుడు ఎక్కడి వెళ్ళాడని ప్రశ్నించాడు. ఇంట్లో భోజనం చేస్తున్నారని తెలుపుతుండగా వృద్ధురాలి మెడలో వున్న 35గ్రాముల బంగారం గొలుసు, దానికున్న 7గ్రాముల డాలర్‌తో సహా మరొక వ్యక్తి వెనుకనే వచ్చి లాక్కొని స్కూటర్‌పై ఇద్దరు పారిపోయారు. వృద్ధురాలి కేకలు విన్న కుమారులు వెంటనే వారిని వెంబడించగా వారు పరికిదొన మార్గంలో అతి వేగంగా వెళ్ళినట్లు గుర్తించారు. ఈమేరకు స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలి కుమారుడు శివశంకర తెలిపాడు. వెంటనే స్పందించిన పుంగనూరు రూరల్ సిఐ రాంభూపాల్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. చుట్టుపక్కలున్న సిసి టీవి పుటేజీలను పరిశీలించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## తిరుచ్చి వాహనంపై దేవేరులతో కల్యాణ వెంకన్న



చంద్రగిరి, నవంబర్ 2 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం దేవదేవుడైన శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి వారు తన దేవేరులు శ్రీదేవి భూదేవి సమేతుడై తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ ఎం.గోపినాద్, సూపరింటెండెంట్స్ తేనెపల్లి వెంకటస్వామి, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు కేనమాకులపల్లి రాజు, అధ్యాపక రవిచంద్రన్, పరిచారిక డాక్టర్ ఉదయ్ తేజ, జమేధార్ సుబ్రమణ్యం, సిబ్బంది చెంగయ్య పాల్గొన్నారు.

## బిల్వ, కుంకుమార్చనల వేదపండితులకు పట్టు వస్త్రాలు



శ్రీకాళహస్తి, నవంబర్ 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం కార్తీక మాసం సందర్భంగా స్వామి వారికి కోటి బిల్వార్చన, అమ్మవారికి కోటి కుంకుమార్చనలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా స్థానిక సంప్రదాయం మేరకు శ్రీకారం చుట్టారు. ఎంతో మహిమాన్వితమైన ఈ కార్యక్రమాలను 2012లో నిర్వహించారు. సంప్రదాయాలు, స్థానికాచారాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే ఇఓగా 40రోజులు పని చేసిన ఆర్‌జెసి ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ కార్తీక మాసంలో సంప్రదాయ కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఈ కార్యక్రమాలను 27రోజుల పాటు నిర్వహించుటకు నిర్ణయించారు. 25 మంది వేదపండితులను వివిధ వేదపాఠశాలల నుంచి రప్పించారు. ఈ సందర్భంగా సహస్రలింగేశ్వరుని సన్నిధికి ఎదురుగా కార్యక్రమాలను నిర్వహించారు. హోమాలు జరిపి కలశ స్థాపన గావించారు. స్వామి అమ్మవార్లను కలశంలో అవాహన గావించారు. తరువాత ఆలయ ప్రధాన అభిషేక గురుకుల్, డాక్టర్ ఎస్ఎంకె స్వామినాథన్ గురుకుల్ పూజలు నిర్వహించగా ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వేదమంత్రాలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఇక మీదట ప్రతి రోజూ స్వామి గర్భగుడి ఎదురుగా బిల్వార్చనలు, అమ్మవారి గర్భగుడి ఎదురుగా కుంకు మార్చనలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేదపండితులు శివ సహస్ర నామార్చనను, అమ్మవారి సహస్రనామార్చనలను పఠించారు. వేదపండితులకు డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి పట్టు వస్త్రాలను అందించారు. ఆలయ అభిషేక గురుకుల్ దీక్షా గురుకుల్ నిరంజన్ స్వామి, వేదపండితులు మారుతీ శర్మ, శ్రీనివాస శర్మ, సంగమేశ్వరశర్మ, విశ్వనాథ్‌శర్మ, అవినాష్ శర్మ, హేమంత్‌శర్మ, కృష్ణమాచార్యులు, చైతన్య, జిష్ణు, సీనియర్ వేదపండితులు చంద్రశేఖర్ శాస్త్రిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో డెప్యూటీ ఇఓ ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, ఆలయ ప్రధానార్చ కులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్ సూపరింటెండెంట్‌లు నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 1.28కోట్లతో గుంతల రహిత రహదారులు ఏర్పాటు

### - ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్



కుప్పంరూరల్, నవంబర్ 2 ప్రభాతవార్త : మిషన్ పాట్‌హోల్ ఫ్రీ ఎపి కార్యక్రమంలో భాగంగా కుప్పం ఆర్‌అండ్‌బి డివిజన్ పరిధిలో 1.28కోట్ల తో గుంతల రహిత రహదారులను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని వసనాడు గ్రామంలో రోడ్ల మరమ్మతుల పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 51కి.మీ.ల మేర గుంతల రహిత రహదారులను ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 861 కోట్లతో రహదారుల్లో గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రంలోని రహదారులు అన్నీ గుంతలమయంగా మారి ప్రజలు ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడ్డారన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా దీపావళి కానుకగా దీపం 2.0 కార్యక్రమాన్ని సిఎం చంద్రబాబునాయుడు ప్రారంభించి మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. ముమ్మందు ఎన్నికల హామీలన్నింటినీ ఎన్డీయే ప్రభుత్వం ఖచ్చితంగా అమలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపిఎస్‌ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, డిఇ దస్తగిరి, నేతలు రాజగోపాల్, మహేంద్ర, వల్లెప్ప, అనసూయ, సంతోష్ పాల్గొన్నారు.

## ఓ కర్మాగారంలో పనిచేస్తున్న యువకుడు మృతి



గూడూరు, నవంబర్ 2, ప్రభాతవార్త గూడూరు రెండవ పట్టణ పరిధిలోని ఓ కర్మాగారంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న గోపికృష్ణ (38) ప్రమాదవశాత్తు కోర్ బాక్స్ యంత్రంలో పడి తలకు బలంగా తెరవడంతో చికిత్స నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతి చెందిన గోపికృష్ణ కోవూరు నగరానికి చెందిన వ్యక్తి కర్మాకారంలో పర్మనెంట్ ఉద్యోగం చేపడుతన్నాడు. విషయం తెలుసుకున్న రెండో పట్టణ సిఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలు సేకరిస్తున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీటి పరాంతమయ్యారు.

## స్విమ్స్‌లో సిఎంఇ విజయవంతం



తిరుపతి హెల్త్, నవంబర్ 2 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞన సంస్థ అనాటమి, ఫోరెన్సిక్ మెడిసిన్, జనరల్ సర్జరీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం శ్రీ పద్మావతి ఆడిటోరియంలో నిరంతర వైద్య విద్య కార్యక్రమంను నిర్వహించి నట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలిపారు. అనటామి విభాగాధిపతి ప్రొ. డా. వి.శ్రీకాంత్ అనటామి ఆఫ్ ఇంగువివల్ ఇది ఇంగువివల్ ప్రాంతాన్ని గజ్జ అని కూడా అంటారని ఈప్రాంతం పొత్తికడుపు గోడ యొక్క దిగువ బాగానికి దిగువ, తొడల కంటే ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతం చాలా ముఖ్యమైనదని ఇది స్పెరామటిక్ నాళాలు, నరాలు వంటి గజ్జల ద్వారా వెళ్ళే నార్మాణాలను కలిగి ఉంటుందని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలిపారు. అనంతరం పోరెన్సిక్ మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొ. డా. వి.హరిప్రసాద్ వృత్తిపరమైన నిర్లక్ష్యం అనేది వైద్య నిపుణుడు తమ విదులనఉ అవసరమైన ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించడంలో విఫలమైతే రోగికి హాని కలిగించడం ఇందులో ఎక్స్‌రే తీయడంలో విఫలమైంది. రోగిని తప్పుగా నిర్ధారణ చేయడం రోగి లోపల శస్త్రచికిత్స సాధనాలను వదిలివేయడం, ప్రాణాంతకమైన మోతాదును ఇంజక్ట్ చేయడం వంటి వాటిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సర్జరీ అసిస్టెంట్ ప్రొ. ఎన్. రోహిణి కుమార్, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రమౌళీశ్వరన్, జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ముక్తేశ్వరయ్య, డా. వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధి సమపాలనలో తీసుకెళ్లడమే ధ్యేయం



పాకాల, నవంబర్ 2, ప్రభాతవార్త : పాకాల మండల కేంద్రంలో అభివృద్ధికి సూచికలుగా గుంతల రహిత రహదారులను ఏర్పాటు చేసేందుకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌లు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. పాకాల మండలంలోని పలు పంచాయితీలలో గుంతల రహిత రహదారుల కార్యక్రమంను భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 6 కిలో మీటర్లకు గాను 4.50 లక్షల రూపాయిలతో మరమ్మతులను చేపట్టనున్నట్లు తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో మొదటి ఫేస్‌లో 11 గుంటల రహిత రహదారి పనులకు 87.63కిలో మీటర్లకు 89.40 లక్షల రూపాయిలతో మరమ్మత్తులు చేపట్టనున్నట్లు వారు వివరించారు. ముఖ్యంగా పాకాల మండలంలో ఏనుగుల బెడద ఎక్కువై అటవీ ప్రాంతం సమీపంలోని గ్రామాల పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయని, వాటి వలన తీవ్ర నష్టం వాటిల్లుతుందని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. సెల్ టవర్ సంబంధించిన ప్రతినిధులతో మాట్లాడి సెల్ టవర్లు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యేకు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పత్రికా ప్రకటన

**డాక్యుమెంట్లు పడిపోయినవి**

తేది 02-11-2024 శనివారం ఉదయం 9.00గం.ల సమయంలో వెంకటగిరి టౌన్ తూర్పువీధి, పాత బస్టాండు దగ్గర డ్యాకుమెంట్లు నెం.372/99 మరియు 377/99 లు పడిపోయినవి. ఎవరికైనా దొరికితే ఈ క్రింది అడ్రస్సుకు చేర్చవలసినదిగా కోరుచున్నాము.

డాక్టర్ నాగం శేషమనాయుడు
పాతబస్టాండ్, వెంకటగిరి
సెల్:9676649635